విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

TELTEL/2012/47103

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 12 సంచిక :104 నల్గొండ | గురువారం 10-07-2025 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 | వెల : రూ.1/-

## ఆధునికత అభ్యుదయానికి కేంద్రంగా తెలంగాణ



హైదరాబాద్ : ఆధునికత అభ్యుదయానికి కేంద్రంగా తెలంగాణ రాష్ట్రం రోజురోజుకు శర వేగంగా అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ లోని కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నేడు నిర్వహించిన చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్స్ సదస్సు లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, . ఔటర్ రింగ్ రోడ్డు ఫలితాలను మనం చూసామని అంటూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డును ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుందని వివరించారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో ఫార్మా, ఐటీ కంపెనీలతోపాటు హౌసింగ్, అగ్రికల్చర్, హ్యాండ్లూమ్స్ వంటి అనేక రకాల పారిశ్రామిక క్లస్టర్ల నిర్మాణం జరుగుతుందని వివరించారు.హైదరాబాద్ కు ప్రపంచం నలుమూలల నుంచి పెట్టుబడులు తరలివస్తున్నాయని తెలిపారు. లండన్ లోనీ థేమ్స్ నది మాదిరిగా హైదరాబాద్ నగరంలో మూసి నదిని పారించేందుకు మూసి పునర్జీవనం ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. పెట్టుబడులకు హైదరాబాద్ పట్టణం, తెలంగాణ రాష్ట్రం స్వర్గ ధామం లాంటిదని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో నైపుణ్యం ఉన్న కార్మికులు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువ ధరకు లభిస్తారని, , చక్కటి వాతావరణం, కాలుష్య రహితం, 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా వంటి అనేక అంశాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు.నైపుణ్యం ఉన్న మానవ వనరులను సృష్టించడమే లక్ష్యంగా రాష్ట్రంలోని 100 ఐటిఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాదులో హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ మూడు సిటీలు ఉన్నాయి త్వరలో ఫ్యూచర్ సిటీ ఫోర్త్ సిటీ గా అందుబాటులోకి రాబోతుందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.రాష్ట్ర అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు కీలకం రాష్ట్ర అభివృద్ధికి, ఉపాధి కల్పన, సంపద సృష్టికి పారిశ్రామికవేత్తల సలహాలు సూచనలు స్వీకరించి అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని డిప్యూటీ సీఎం పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను తమ కుటుంబ సభ్యులుగా పరిగణిస్తుందన్నారు. కలిసి సాగుదాం రాష్ట్రంలో మార్పుకు శ్రీకారం చూడదామని తెలిపారు.పారిశ్రామిక వేత్తలు సిఎస్ ఆర్ నిధులను పాఠశాలలు, నాలెడ్జ్ సెంటర్ల కోసమే కాకుండా రైతులు, మహిళల ప్రగతి కోసం కూడా ఖర్చు చేయాలని డి భట్టి విక్రమార్క సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐఐ నిర్వాహకులు శేఖర్ రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, బి.వి.ఆర్ మోహన్ రెడ్డి, ఎంవి నరసింహం, గౌతమ్ రెడ్డి, సమీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆచూకీ లభించని 8 కార్మికులపై అధికారుల కీలక ప్రకటన..!



సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర పేలుడు ఘటనపై అధికారులు కీలక ప్రకటన చేశారు. ప్రమాదం జరిగిన రోజు గల్లంతైన 8 మంది కార్మికులు ఇంకా కనిపించకపోవడంతో, ఇక వారి ఆచూకీ లభించడం అసాధ్యమే అని అధికారులు తేల్చేశారు.రాహుల్, శివాజీ, వెంకటేష్, విజయ్, అఖిలేష్, జస్టిన్, రవి, ఇర్ఫాన్ ల బాడీలు పేలుడు సమయంలో తీవ్రంగా కాలిపోయి బూడిదయ్యి ఉంటారని యాజమాన్యం అనుమానం వ్యక్తం చేస్తుంది. దీని కారణం ఇప్పటివరకు 100కి పైగా శాంపిల్స్‌ను సేకరించి డిఎన్ఏ పరీక్షలు నిర్వహించినా ఒకటికీ కూడా తగిన పోలిక లభించలేదు. ఈ నేపథ్యంలో, బాధిత కార్మికుల కుటుంబ సభ్యులను పరిశ్రమ వద్ద నుంచి ఇళ్లకు వెళ్లిపోవాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మూడునెలల తర్వాత తిరిగి రావాలని సూశించారు. అప్పటివరకు రాష్ట్ర, కేంద్ర హోంశాఖలతో సంప్రదింపులు కొనసాగిస్తామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు తిరిగి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘటనలో బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలని తమవారిని కోల్పోయిన ప్రజలు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## కాంగ్రెస్ ప్రజా పాలన సభ అట్టర్ ప్లాప్



మహబూబాబాద్ : నిన్న మహబూబాబాద్ నియోజకవర్గంలో జరిగిన కాంగ్రెస్ ప్రజా పాలన సభ అట్టర్ ఫ్లాప్ అయింది. ఆరుగురు మంత్రులు వచ్చి ఆర్భాటం చేశారు తప్పా అభివృద్ధికి కోసం చేసింది ఏమీ లేదని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలే ఎక్కువగా ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీ పాలనలో అభివృద్ధి మీద చర్చకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమా? అని ప్రశ్నించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరు నెలల కింద కురవి మండలం వద్ద శంకుస్థాపన చేసిన పని ఇంకా ప్రారంభం కూడా కాలేదన్నారు. చెరువుల్లో చుక్క నీరు లేక కట్టలు తెగి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.భట్టి విక్రమార్క తన స్థాయిని మించి మాట్లాడుతున్నాడు. పంచెలు కట్టినంత మాత్రాన రైతులు అవుతారా? అని నిలాదీశారు. ఇందిరమ్మ ఇండ్లకు ఒక్క రూపాయి అయిన చెల్లించారా.. భూభారతి ద్వారా ఒక్క ఎకరం భూమి సమస్య అయిన పరిష్కారం చేసావా అని మంత్రి పొగుంలేటిని నిలదీశారు. మహబూబాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ చేసిన దాంట్లో10 శాతం అయినా అభివృద్ధి పనులు చేయాలని సవాల్ విసిరారు. ఒక్క మహిళ అయినా కాంగ్రెస్ 18 నెలల పాలనలో కోటీశ్వరురాలు అయ్యిందా? ఒక్క సారి మంత్రి సీతక్క ఆ మహిళను చూపెట్టాలన్నారు. సీతక్క మంత్రి స్థాయిలో ఉండి శాపనార్థాలు పెడుతుంది, నెత్తిన మూటలు మోసి ప్రజలను మోసం చేస్తున్నావు అని విమర్శించారు.

## దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల బంద్



న్యూఢిల్లీ,జూలై9: కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ట్రేడ్ యూనియన్ సంస్థలు బుధవారం దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చాయి. దేశ వ్యాప్తంగా ఉన్న 10 సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు బంద్‌లో పాల్గొన్నాయి. ట్రేడ్ యూనియన్లకు రైతు సంఘాలు సైతం మద్దతుగా నిలిచాయి. దేశ వ్యాప్తంగా దాదాపు 25 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల్ని బహిష్కరించినట్లు సమాచారం. ఇక, కేరళలో బంద్ ప్రభావం బాగా కనిపిస్తోంది. ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా ఆగిపోయింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, షాపులు మూతపడ్డాయి. కోయికోడ్, మలప్పురం, కన్నూర్, కాసరగడ్‌లలో బంద్ పూర్తి స్థాయిలో జరుగుతోంది. రోడ్లు మొత్తం నిర్మానుషంగా మారాయి. ఒడిశా రాష్ట్రంలో సీఐటీ-యూ శ్రేణులు రోడ్లపై నిరసనలు వ్యక్తం చేశాయి. ప్రభుత్వ ఉద్యోగుల కనీస పెన్షన్ 9 వేల రూపాయలు చేయాలని డిమాండ్ చేశాయి. పశ్చిమ బెంగాల్లో ట్రేడ్ యూనియన్ల నిరసలు ఉద్రిక్తతలకు దారి తీస్తున్నాయి. నిరసనకారులు ఓ చోట రోడ్డుపై దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. మిద్నాపూర్ బస్ట్ స్టేషన్‌ను సైతం ముట్టడించారు. బీహార్‌లో అయితే ఏకంగా రైల్వే ట్రాకులపైకి వచ్చి మరీ ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆర్జేడీ శ్రేణులు దర్భంగాలో నమో భారత్ రైలును ఆపేశాయి. ఇక, ముంబైలో భారత్ బంద్‌ను దృష్టిలో పెట్టుకుని పలు ప్రైవేట్ రంగ సంస్థలు ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చాయి. తమిళనాడు, కర్ణాటక, ఏపీ, తెలంగాణలలో ట్రేడ్ యూనియన్ల బంద్ ప్రభావం అంతగా కనిపించటం లేదు.

## వందమంది ఎమ్మెల్యేల మద్దతు.. సీఎంగా డీకే శివకుమార్?



బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ రాజకీయం రసకందాయంలో పడింది. డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్‌ను సీఎంను చేయాలంటూ అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బాంబు పేల్చారు. రాష్ట్రంలో ఎక్కువ శాతం మంది ఎమ్మెల్యేలు డీకేఎస్ వెంట ఉన్నారంటూ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలు చర్చాంశనీయంగా మారాయి. ఈ క్రమంలో డీకేఎస్ సైతం హస్తినలో పర్యటించడం.. రాష్ట్రంలో సీఎం, డిప్యూటీ సీఎం పదవుల్లో పెనుమార్పులు చోటు చేసుకోనున్నాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఎందుకంటే? 2023లో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సిద్ధరామయ్యకు సీఎం పదవి, డీకేఎస్‌కు డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టింది. ఆ సమయంలో పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంపై డీకేఎస్ వర్గం అంతర్గతంగా అసంతృప్తిని వ్యక్తం చేసింది. పైకి మాత్రం సిద్ధరామయ్య 2.5 సంవత్సరాలు, తర్వాత డీకే శివకుమార్ సీఎం అయ్యేలా ఒప్పందాలు జరిగాయంటూ ప్రచారం చేసింది. ఇప్పుడు ఆ 2.5 సంవత్సరాల గడువు సెప్టెంబర్‌లో ముగియనుండటంతో, డీకే శివకుమార్ మద్దతు దారులు మళ్లీ ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్ మాట్లాడుతూ.. 'అవును, చాలా మంది ఎమ్మెల్యేలు డీకే శివకుమార్‌ను సీఎం చేయాలని కోరుతున్నారు. మా జిల్లా ప్రజలు కూడా అదే అభిప్రాయంతో ఉన్నారు' అని చెప్పారు. మరో ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మరో అడుగు ముందుకు వేసి రాష్ట్రంలోని 100 మందికి పైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డీకే శివకుమార్‌కు మద్దతుగా ఉన్నారు అని పునరుద్ఘాటించారు.

### ప్రతి ఒక్కరికీ ఆశ ఉండొచ్చు

కర్ణాటక రాజకీయంపై ఇప్పటికే ఆ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్కరికీ ఆశ ఉండొచ్చు. కానీ పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు . గతంలో ఇదే వివాదాన్ని పరిష్కరించేందుకు పార్టీ అధిష్టానం రణదీప్ సూర్జేవాలాను మధ్యవర్తిగా వ్యవహరించారు.

### అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం

మరోవైపు తనని సీఎంను చేయాలంటూ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న డిమాండ్లపై డీకే శివకుమార్ స్పందించారు. నా కోసం మాట్లాడమని నేను ఎవరికీ చెప్పలేదు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా నాకు అది శిరోధార్యమని స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం మాత్రం సిద్ధరామయ్యను మార్చే ఉద్దేశం లేదని అధికారికంగా ఆయనను మార్చే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. సిద్ధరామయ్యను కొనసాగించాలనే వైఖరిలోనే ఉంది. కానీ డీకే శివకుమార్ వర్గం నుంచి వచ్చే ఒత్తిడి, ఎమ్మెల్యేల మద్దతు,2028 ఎన్నికల దృష్ట్యా పార్టీ తన నిర్ణయాన్ని మార్చుకుంటుందేమోనని డీకే వర్గం భావిస్తోంది. మరి ముందుముందు ఏమవుతుందో చూడాలి మరి

## నేనూ కష్టపడి చదవి పైకి వచ్చా...



కరీంనగర్,జూలై9: తల దించుకుని చదవండి.. తలెత్తుకునే స్థాయికి చేరండి అని విద్యార్థులను ఉద్దేశించి కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మీ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు పెట్టుకోండి, మీరు చదువులో పైకి వెళ్లాలి. నేనంటే అభిమానించే పిల్లలే నా గెలుపుకు ప్రధాన కారణం. 50 శాతం ఓట్లు వారి వల్లే వచ్చాయి. పిల్లలపై మీరు చూపుతున్న ప్రేమకి నేను ఏం ఇచ్చినా రుణం తీరదని తెలిపారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిని తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. ఈ సైకిళ్లు మోదీ ఇస్తున్న గిఫ్ట్ అన్నారు.విద్యారంగానికి ఎనలేని ప్రాధాన్యతనిస్తున్న మోదీ సర్కార్ కు ఇది చిన్న ఉదాహరణ అని తెలిపారు. అలాగే, నేను మీలాగే పేదరికం నుంచి వచ్చిన వాడినే.. తిండికి ఇబ్బందులు పడ్డ రోజులు నాకు ఉన్నాయి. కానీ, మా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మమ్మల్ని ఈ స్థాయికి తీసుకువచ్చారని భావోద్వేగం చెందారు. బండి సంజయ్ తమ ఎంపీ పదవిలో ఉన్నంత కాలం ప్రతి ఏటా టెన్త్ పిల్లలకు సైకిళ్లు అందిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాదు, త్వరలోనే ప్రతి విద్యార్థికి 'మోదీ కిట్'ను అందిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. సైకిల్ అనేది సెల్ఫ్ కాన్ఫిడెన్స్ కు ప్రతీక అని పేర్కొన్నారు. ఇక కార్యక్రమంలో కేంద్ర మంత్రిని ఎమ్మెల్సీ కొమరయ్య ఘనంగా సత్కరించారు. రాబోయే నెల రోజుల్లోనే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ పూర్తి చేయనున్నట్లు- బండి సంజయ్ తెలిపారు.

## రాజస్థాన్ లో కూలిన ఎయిర్ ఫోర్స్ విమానం.. ఇద్దరు పైలెట్ లు దుర్మరణం



జైపూర్ : రాజస్థాన్‌లో ఎయిర్ ఫోర్స్ విమానం నేడు కుప్పకూలింది . చురులోని రతన్‌గఢ్ ప్రాంతంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన విమానం ప్రమాదవశాత్తు కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో పైలట్ లు ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాద ధాటికి పొలంలో విమాన శకలాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఎయిర్‌ఫోర్స్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

### ఇండిగో విమానాన్ని ఢీకొన్న పక్షి

పాట్నా నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఇండిగో విమానం గాల్లో ఉండగా పక్షి ఢీకొనడంతో అత్యవసరంగా వెనక్కి తిరిగి పాట్నా విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ఈ ఘటన జరిగినప్పుడు విమానంలో 169 మంది ప్రయాణికులు ఉన్నారు. వారంతా సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.పాట్నా విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఇండిగో విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగింది. పక్షి బలంగా ఢీకొట్టడంతో విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. అప్రమత్తమైన పైలట్ వెంటనే విమానాన్ని వెనక్కి మళ్లించి పాట్నాలోనే సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రస్తుతం విమానానికి మరమ్మతులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఇటీవలి కాలంలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతుండటం గమనార్హం. ఇటీవలే పాట్నా నుంచి రాంచీ వెళుతున్న మరో ఇండిగో విమానాన్ని గాల్లో గద్ద ఢీకొట్టింది. ఆ సమయంలో విమానం దాదాపు 4,000 అడుగుల ఎత్తులో ఉంది. ఈ ఘటనలో 175 మంది ప్రయాణికులు ఉండగా, పైలట్ చాకచక్యంగా విమానాన్ని రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయంలో సురక్షితంగా దించారు.

### సింగరేణిలో సమ్మెకు దిగిన కార్మికులు

గోదావరిఖని,నూతన కార్మిక చట్టాలు, ప్రైవేటీకరణ చర్యల్ని వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా కార్మికులు సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా బెల్లంపల్లి పరిధిలో సింగరేణి కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. గనుల్లో స్వచ్ఛందంగా విధులు బహిష్కరించారు. మందమర్రిలోనూ సింగరేణి కార్మికులు విధులకు వెళ్లలేదు. కేకే-5 గనిపై ఐకే సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

## కల్తీకల్లు బాధితులకు మంత్రిజూపల్లి పరామర్శ



హైదరాబాద్,జూలై9: నగరంలో కల్తీ కల్లు వ్యవహారంపై మంత్రి జూపల్లి కృష్ణారావు సీరియస్ అయ్యారు. అమాయకుల ప్రాణాలు తీస్తున్న కల్తీకల్లును అరికడతామని అన్నారు. నగరంలో కలుషితమైన కల్లు తాగి 19 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కాగా బాధితుల్లో ముగ్గురు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతున్న కల్లు బాధితులని మంత్రి జూపల్లి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించిందన్నారు. మెరుగైన చికిత్స కోసం బాధితులను నిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న 15 మంది పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఘటనకు కారణమైన కల్లు కాంపౌండ్‌లు సీజ్ చేశామని, కల్లు కాంపౌండ్ నిర్వాహకులను అరెస్టు చేశామని వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లో దీనికి కారణమైన వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కల్లు శాంపిల్‌ను కెమికల్ టెస్ట్ కోసం ల్యాబ్‌కి పంపినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కూకట్‌పల్లి ప్రాంతంలో 19 మంది గత ఆదివారం కల్లు తాగారు. అయితే, మరుసటి రోజు ఉదయం నుంచి వారిలో ఒక్కొక్కరిగా అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన వాంతులు,విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. దీంతో వారి కుటుంబ సభ్యులు హుటాహుటిన బాధితులను ఆసుపత్రికి తరలించారు. నిమ్స్ లో 15 మంది చికిత్స పొందుతుండగా,గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు.అంతేకాకుండా మరో వ్యక్తి ఇంట్లోనే మృతి చెందారు. మృతులు తుల సిరామ్ (47), బొజ్జయ్య (55), నారాయణమ్మ (65)గా గుర్తించారు. మృతులంతా హెచ్ఎంటీ- హిల్స్ సాయిచరణ్‌కాలనీకి చెందినవారిగా అధికారులు తెలిపారు.

## సంపాదకీయం

**గురువారం 10-07-2025**

# గ్రీన్ హైడ్రోజన్... రేపటి ఇంధనం

శిలాజ ఇంధనాల వాడకంతో వాతావరణ మార్పులు తీవ్రతరమవుతున్నాయి. విపత్తులు ముంచుకొస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పర్యావరణ హితకరమైన గ్రీన్ హైడ్రోజన్ వినియోగంపై భారత్ దృష్టి సారించింది. ఈ క్రమంలో దేశీయ ఇంధన రంగంలో జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టగలదు. భావి తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్నీ, నూతన ఉద్యోగ అవకాశాలనూ అది అందివ్వగలదు.ప్రపంచం శుద్ధ ఇంధనం వైపు మళ్లుతున్న తరుణంలో, భారత్ గ్రీన్ హైడ్రోజన్ అభివృద్ధిపై దృష్టి సారిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2023లో 'నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్'ను ప్రారంభించింది. దేశీయంగా హరిత హైడ్రోజన్ ఉత్పత్తిని పెంచి పరిశ్రమలకు సరఫరా చేయడంతో పాటు, ఈ ఇంధన రంగంలో ఇండియాను ప్రపంచంలోనే ప్రధాన ఎగుమతిదారుగా నిలిపేందుకు దీన్ని ఉద్దేశించారు. సౌర, పవన విద్యుత్ సాయంతో నీటి నుంచి ఉత్పత్తి చేసే స్వచ్ఛమైన ఇంధనమే గ్రీన్ హైడ్రోజన్. ఈ ప్రక్రియలో ఎలాంటి కర్బన ఉద్గారాలూ వెలువడవు. మీథేన్‌ను మండించడం ద్వారా తయారయ్యేది 'గ్రే హైడ్రోజన్'. ఇది పర్యావరణానికి తీవ్రనష్టం కలిగిస్తుంది. ఇదే విధానంలో ఇంధనాన్ని తయారుచేసి కర్బన ఉద్గారాలను భూమిలో నిల్వచేస్తే– దాన్ని 'బ్లూ హైడ్రోజన్' అంటారు. దీనివల్లా పర్యావరణానికి కొంత హాని తప్పదు. అందుకనే, ప్రపంచ దేశాలు గ్రీన్ హైడ్రోజన్ తయారీకే ప్రాధాన్యమిస్తున్నాయి. వాయు రూపంలో ఉండే ఈ ఇంధనాన్ని నిల్వ చేయడం, తరలించడం చాలా సులభం. కాబట్టి ఇది పరిశ్రమలు, రవాణా సాధనాలకు బాగా ఉపయోగపడుతుంది.

**చవగ్గా అందుబాటులోకి?**

కేంద్రం 2023లో జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్‌కు రూ.19,744 కోట్లు మంజూరు చేసింది. ఈ మిషన్ ద్వారా 2030నాటికి అయిదు మిలియన్ మెట్రిక్ టన్నుల ఇంధనోత్పత్తి సామర్థ్యాన్ని సాధించడంతో పాటు– ఎనిమిది లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించి, ఆరు లక్షల ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా 50మిలియన్ టన్నుల వాయు ఉద్గారాలను, రూ.లక్ష కోట్ల విలువైన ఇంధన దిగుమతులను తగ్గించుకోవచ్చని భావిస్తున్నారు. ఈ లక్ష్యాల సాధన కోసం 'స్ట్రాటజిక్ ఇంటర్వెన్షన్ ఫర్ గ్రీన్ హైడ్రోజన్ ట్రాన్సిషన్' పథకానికి రూ.17,490 కోట్లు ప్రత్యేకించారు. తద్వారా దేశీయ ఎలక్ట్రోలైజర్ తయారీకి, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ప్రోత్సాహం లభిస్తోంది. దీనికి తోడు పైలట్ ప్రాజెక్టులకు రూ.1,466 కోట్లు, పరిశోధనలూ నూతన నైపుణ్యాల శిక్షణ కోసం మరో రూ.400 కోట్లు ఖర్చు చేయనున్నారు. గ్రీన్ హైడ్రోజన్ తయారీకి ఉపయోగించే పునరుత్పాదక విద్యుత్తుపై ట్రాన్స్‌మిషన్ ఛార్జీలను మరో అయిదేళ్ల వరకూ మాఫీ చేస్తున్నారు. దానివల్ల హైడ్రోజన్ ధర సుమారు 20శాతం వరకు తగ్గే అవకాశముంది. తద్వారా 2030 నాటికి కిలో గ్రీన్ హైడ్రోజన్‌ను 100-150 రూపాయలకే అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల దేశంలోనే మొదటిసారిగా లద్దాఖ్‌లో హైడ్రోజన్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. వాటి కోసం అక్కడ ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో శుద్ధ ఇంధనోత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పారు. దీంతో దేశవ్యాప్తంగా ఇటువంటి రవాణా వ్యవస్థను తీసుకురావడం సాధ్యమేనని నిపుణులు అంటున్నారు. ఇంధన సంస్థలు సైతం గ్రీన్ హైడ్రోజన్ వైపు మొగ్గుచూపుతున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తన పానిపట్ రిఫైనరీలో ఈ ఇంధనాన్ని ఉపయోగించేందుకు సరఫరాదారులను ఎంపిక చేసింది.


**క్వాంటమ్ వ్యాలీతో ఊతం**

భారతదేశ హరిత హైడ్రోజన్ ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్ ముందుంది. విశాఖపట్నం సమీపంలోని పూడిమడక దగ్గర దేశంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్ కేంద్రానికి అంకురారోపణ చేశారు. ఇక్కడ రోజూ 1500టన్నుల హైడ్రోజన్‌తో పాటు 7500 టన్నుల గ్రీన్ అమోనియా, మెథనాల్, విమానయాన ఇంధనం తయారవుతుంది. ఈ ప్రాజెక్టు అంచనా విలువ సుమారు రూ.1.85లక్షల కోట్లు. మరోవైపు, ఐరోపా సంస్థల భాగస్వామ్యంతో కాకినాడలో ఏటా పది లక్షల టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి కర్మాగారాన్ని నెలకొల్పుతున్నారు. దీనికోసం 1.3 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్లను ఆర్డర్ చేశారు. ఇది భారత్‌లోనే ఇప్పటివరకు ఇచ్చిన అతిపెద్ద ఆర్డర్. ఇందులో పూర్తిగా సౌర, పవన విద్యుత్తునే వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఐరోపా దేశాలకు అమోనియాను ఎగుమతి చేస్తారు. అమరావతిలో ఏర్పాటవుతున్న 'క్వాంటమ్ వ్యాలీ' సైతం గ్రీన్ హైడ్రోజన్ రంగానికి ఇతోధికంగా తోడ్పడనుంది. ముఖ్యంగా వాతావరణం ఎక్కడ అనుకూలంగా ఉంటుంది? ఇంధనాన్ని ఎక్కడ నిల్వ చేయాలి? అనేది నిర్ణయించడానికి డేటా కీలకం. ఇందుకు అమరావతిలో అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ వాతావరణం అక్కరకు వస్తుంది.

**సవాళ్లను అధిగమించడమే కీలకం**

ప్రపంచ గ్రీన్ హైడ్రోజన్ రంగంలో విధానాలు, నిబంధనలు, పెట్టుబడుల పరంగా ఐరోపా దేశాలు ముందంజలో ఉన్నాయి. అయినప్పటికీ, భారత్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ దిగుమతికి అవి ఆసక్తి చూపుతున్నాయి. ఆస్ట్రేలియా సైతం పెద్దయెత్తున ఈ హరిత ఇంధనోత్పత్తిని చేపట్టి జపాన్ వంటి దేశాలకు ఎగుమతి చేయాలని భావిస్తోంది. ఇండియా వాటితో సమానంగా పోటీపడుతున్నప్పటికీ, కొన్ని సవాళ్లు తప్పడం లేదు. మన దగ్గర కిలో గ్రీన్ హైడ్రోజన్ తయారీకి రూ.450 వరకు ఖర్చవుతోంది. ఈ భారాన్ని తగ్గించుకోవాలంటే మెరుగైన ఉత్పత్తి విధానాలు చేపట్టడంతో పాటు చవగ్గా లభించే ఎలక్ట్రోలైజర్లను అభివృద్ధి చేసుకోవాలి. పైపులైన్లు, నిల్వ కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లను విస్తరించాలి. పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్నీ గణనీయంగా పెంచుకోవాలి.కిలో హైడ్రోజన్ తయారీకి దాదాపు తొమ్మిది లీటర్ల నీరు అవసరమవుతుంది. కాబట్టి, జల వనరుల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. అమెరికా, ఐరోపా దేశాలు భారీగా ప్రోత్సాహకాలు అందిస్తుండటంతో గ్లోబల్ మార్కెట్‌లో తీవ్ర పోటీ నెలకొంది. స్థిరంగా మౌలిక సదుపాయాలను కల్పించడం, ప్రోత్సాహకర విధానాలు చేపట్టడం, పరిశోధనల కు ఊతమివ్వడం ద్వారా భారత్ ఈ సవాళ్లన్నింటినీ అధిగమించవచ్చు.

# మారనున్న మహారాష్ట్ర రాజకీయ చిత్రం



ముంబై:మహారాష్ట్రలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయా? దాదాపు 20 ఏళ్లపాటు తూర్పు పడమరలుగా ఉన్న థాకరే సోదరులు ఒకే వేదికను పంచుకోవడమే దీనికి సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ బ్రదర్స్ తిరిగి ఒక్కటి కావడంపై ఇప్పుడు మహారాష్ట్రలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. జాతీయ విద్యా విధానం కింద త్రిభాషా సూత్రం అమలులో భాగంగా మహారాష్ట్రలో హిందీని తప్పనిసరి చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 5న విపక్షాలు ఆందోళనకు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమానికి శివసేన ఉద్ధవ్ థాక్రే వర్గం (యుబిటి), రాజ్‌థాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) మద్దతు ప్రకటించాయి. మొదట ఈ రెండు పార్టీలు వేర్వేరుగా నిరసనలు చేపట్టనున్నట్లు ప్రకటించాయి. ఆ తర్వాత ఇద్దరు నేతలు మరాఠీల ప్రయోజనాల కోసం వేర్వేరు నిరసనలు నిర్వహించడం సముచితంకాదని గ్రహించి నిరసన ప్రదర్శనలు సంయుక్తంగా నిర్వహించాలని నిర్ణయించారు.రాజకీయ వైరుద్ధాల కారణంగా రెండు దశాబ్దాలుగా దూరమైన థాకరే వారసులు ఇప్పుడు ఒకే వేదికను పంచుకోవడమే కాకుండా ఇకపై కూడా కలిసి ఉంటామని ప్రకటించడం ఇప్పుడు మరాఠా రాజకీయాలలో పెను సంచలనంగా మారింది. శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాక్రే సోదరుడు శ్రీకాంత్ థాక్రే కుమారుడే రాజ్‌థాక్రే. శ్రీకాంత్ థాక్రే రాజకీయాల్లో క్రియాశీలకంగా లేనప్పటికీ బాల్ థాక్రే వారపత్రిక 'మార్మిక్'లో రాజ్‌థాక్రే కార్టూనిస్టుగా పని చేశారు. అక్కడే ఆయన రాజకీయ ప్రస్థానానికి బీజంపడింది. 90వ దశకంలో శివసేనలో రాజ్‌థాక్రేకు మంచిపేరు ఉండేది. బాల్ థాక్రే అభిమానులు కూడా రాజ్‌నే రాజకీయ వారసుడిగా భావించే వారు. కానీ 2003లో బాల్ థాక్రే తన కుమారుడు ఉద్ధవ్ థాక్రేను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. దీంతో రాజ్ అసంతృప్తికి గురయ్యారు. తనదనంతర పరిణామాలతో 2006లో శివసేనను వదిలిపెట్టి మహారాష్ట్ర నవ నిర్మాణ సేన అనే కొత్త పార్టీని ఏర్పాటు చేశారు.అప్పటినుంచి ఈ సోదరుల మధ్య తీవ్ర విభేదాలు కొనసాగాయి. ఇరువురు నేతలు ఏ వేదికపైనా కలిసి కనిపించలేదు కూడా. దాదాపు 20 సంవత్సరాల తర్వాత ఇప్పుడు వీరిద్దరూ ఒకే సమస్యపై రాజకీయ వేదికను పంచుకోవడం మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఒకప్పుడు మహారాష్ట్రలో తిరుగులేని శక్తిగా ఉండిన శివసేన బాల్ థాక్రే మరణానంతరం కూడా భారతీయ జనతా పార్టీతో రాజకీయ బంధాన్ని కొనసాగించింది. అయితే రానురాను రెండు పార్టీల మధ్య విభేదాలు పొడసూపడంతో వాటి దారులు వేరయ్యాయి. ఈలోగా ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో మెజారిటీ శివసేన ఎంఎల్ఎలు తిరుగుబాటు చేసి బిజెపితో చేతులు కలపడం, ప్రభుత్వంలో భాగస్వాములు కూడా కావడంతో శివసేన రాజకీయంగా బలహీనపడింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపితో కలిసి మహా ఘట్‌బంధన్‌గా ఏర్పడి పోటీ చేసినప్పటికీ అధికారం దక్కకపోగా ఊహించని రీతిలో ఘోర పరాజయం ఎదురైంది.మరో వైపు న్యాయస్థానాల్లో సైతం పార్టీ గుర్తు విషయంలో చుక్కెదురయింది ఈ పరిస్థితుల్లో థాక్రే సోదరులిద్దరూ ఒకటి కావడంతో మహారాష్ట్ర రాజకీయాలు పూర్తిగా మారిపోయే సంకేతాలు కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంత ఓటర్లలో ఇప్పటికీ శివసేన ప్రభావం బాగానే ఉంది. దీంతో ఈ వర్గం ఓటర్లు తమకు దూరమవుతారేమోనన్న భయం బిజెపి నేతల్లో కనిపిస్తోంది. అదే జరిగితే రాబోయే అసెంబ్లీ ఎన్నికలతోపాటు పార్లమెంటు ఎన్నికల్లోను దాని ప్రభావం పార్టీపై ఉంటుందేమోనని కమలనాథుల్లో ఆందోళన మొదలైంది. థాక్రే సోదరులు ఒక్కటి కావడం అందరికన్నా ఎక్కువగా బిజెపి పంచన చేరి కొంతకాలం ముఖ్యమంత్రి పదవిని కూడా అనుభవించిన ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. శివసేనలో తిరుగుబాటు కారణంగా తనపై పడిన నమ్మకద్రోహి ముద్రను తొలగించుకోవడానికి ఆయన శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు థాక్రే సోదరుల కలయికతో ఆ అపప్రథ మరింతగా బలపడే అవకాశం ఉంది.అంతేకాకుండా త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు ముందు సంభవించిన ఈ పరిణామంతో పట్టణ ఓటర్లు ముఖ్యంగా బృహన్ ముంబై కార్పొరేషన్‌లో పట్టు కోల్పోకుండా చూసుకోవడం ఆయన ముందున్న పెను సవాలని విశ్లేషకులు అంటున్నారు. బిజెపి నేతల్లో చాలామంది ఇప్పటికీ ఆయనను దీర్ఘకాలిక భాగస్వామికన్నా కూడా తాత్కాలిక మిత్రుడిగానే చూస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీకి తాజా పరిణామాలు మరిన్ని చిక్కులను తెచ్చిపెట్టనుంది. తన ఓటు బ్యాంక్ అయిన ముస్లింలను బద్ధ శత్రువులుగా చూసే, వీధి పోరాటాలకు దిగే రాజ్‌థాకరేతో ఉద్ధవ్ చేతులు కలిపితే ఆ పార్టీతో బంధాన్ని ఎలా కొనసాగించాలన్న డైలమా కాంగ్రెస్‌లో ఉంది. అయితే రాబోయే రోజుల్లో థాక్రే సోదరులు ఏ విధంగా కలిసి పని చేస్తారనే దానిపైనే రాష్ట్రంలో రాజకీయ చిత్రం ఆధారపడి ఉందనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

### తమిళనాట ఘోర ప్రమాదం

చెన్నై,తమిళనాడులో ఘోర ప్రమాదం చోటు–చేసుకుంది. కడలూరు జిల్లా చెమ్మంగుప్పంలో ప్రైవేట్ స్కూల్ వ్యాన్‌ను రైలు ఢీకొట్టింది. రైలు వెళ్లే సమయానికి గేటు– వేయక పోవడంతో ఈ ఘోరం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రాథమిక నివేదికల ప్రకారం 10 మందికి పైగా విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో స్కూల్ వ్యాన్ నుజ్జునుజ్జు అయినట్లు– కనిపిస్తోంది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు ఘటనపై అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటినా రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సహాయక చర్యలు చేపట్టారు. కాగా, ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# ఎన్‌డిఎ పక్షాల డమ్మీ పాత్ర!

న్యూఢిల్లీ,పేరుకే ఎన్‌డిఎ పాలన అయినా..కేవలం మోడీ పాలనే సాగుతోంది. వరుసగా మూడో దఫా మోడీ ప్రధాని కావడానికి ఎన్‌డిఎ పక్షాల మద్దతు అవసరం అయినా...పాలనా పగ్గాలు మోడీ చేతుల్లోనే ఉన్నాయి. మోడీ కనుసన్నల్లోనే పాలన సాగుతోంది. ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలతో ఏ విసయంలోనూ చర్చలు సాగడం లేదు. గతంలో వాజ్‌పేయ్ హయాంలో తరచూ ప్రధాన అంశాలపై చర్చించేవారు. కానీ ఇప్పుడు పదేళ్లలో ఎలా ఉండే ఇప్పుడూ అలానే ఉంది. ఎన్‌డిఎ పక్షాలు కూడా ఇదేమిటని అడిగే ధైర్యం చేయడం లేదు. ప్రధాన సమస్యలపైన చర్చకు పట్టపబట్టడం లేదు. చంద్రబాబు లౌక్యంగా ఎపి వరకే పరిమితం అయ్యారు. నితీశ్ కుమార్ బీహార్‌కు పరిమితం అయ్యారు. ఎపిలో మిర్చి, మామిడి, ధాన్యం ధరల సమస్యలు వస్తున్నా జాతీయ విధానం గురించి చర్చించే ఆలోచన చేయడం లేదు. కొత్తగా ఏర్పడ్డ ఎన్‌డి కూటమినేతలు ఈ విషయంలో ఆలోచన చేయాలి. మోడీ నిర్ణయాలకు తలూపకుండా క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని, అందుకు పరిష్కార మార్గాలను కనుగొనాలి. ఇలా విద్య,వైద్యం, మౌళిక వసతులు, రోడ్లు తదితర అంశాల పై జాతీయస్థాయిలో చర్చించి ప్రజలకు అనువైన నిర్ణయాలు తీసుకోవాలి. కానీ ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలు కేవలం డమ్మీ పాత్ర పోషిస్తున్నాయి. విద్యారంగంలో మార్పులు రావాల్సి ఉంది. ఇప్పుడున్న విద్యావిధానం ఉద్యోగాలను, ఉపాధిని చూపడం లేదు. విదేశాలకు వెళ్లి చదువుకుందామనుకుంటే ఖరీదైనదిగా ఆమరింది. దేశంలో విద్య ఖరీదైనదిగా మారింది. విదేశీ విద్య కూడా ఖరీదీయినదిగా మారింది. ఈ క్రమంలో విద్యారంగ సంస్కరణలు రావాలి. విదేశాలకు వెళ్లి చదువుకునే వారికి ఇతోధికంగా రుణాలు ఇవ్వాలి. పెరిగిన డాలర్ విలువ, రూపాయి పతనంతో వదేశీ మారకం కోసం విద్యార్థులు, టూరిస్టులు అధికంగా రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. బేటీపడావో బేటీ బచావో అంటున్న ప్రధాని మోడీ కనీసం ఆడపిల్లల చదువుల ఖర్చుల గురించి ఆలోచించడం లేదు. ఆడపిల్లలను చదివించడం కూడా భారంగా మారుతోంది. దేశీయంగా కూడా చదువులు భారంగా మారాయి. విదేశాలకు వెళుతున్న ఆడపిల్లలకు కనీసం వడ్డీ మాఫీ పథకం వర్తింప చేయాలన్న డిమాండ్ పట్టించు కోవడం లేదు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో వడ్డీలేని రుణాలను లేదా నామమాత్రం వడ్డీతో దేశీయంగా, విదేశాల్లో ..ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించే లా పథకాలు రూపొందాల్సి ఉంది. కార్పోరేట్ కంపెనీలకు వేలకోట్లు పందేరం చేస్తున్న ప్రభుత్వం విద్యారంగంలో మాత్రం వెసలుబాటు చూపడం లేదు. ఇక్కడ ఉన్నత చదువులకు, విదేశాల్లో ఉన్నత చదువులకు ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. దీనిపై కేంద్రం ఎక్కడా చర్చించడం లేదు. బ్యాంకులు ఉదారంగా, తక్కువ వడ్డీ రుణాలు అందించడం లేదు. విదేశీ విద్యకోసం రుణాలకు వెళ్లే వారికి నేరుగా రుణాలు లభ్యం కావడం లేదు. సవాలక్ష కొర్రీలు పెట్టి బ్యాంకులు తిరస్కరిస్తున్నాయి. మరోవైపు భారత ఆర్థికవ్యవస్థ కుదేలు కావడంతో పాటు,ద్రవ్యోల్బణం పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. బంగారం ధరలు అందకుండా పోగుతున్నాయి. బంగారం అడ్డూఅదుపు లేకుండా పెరిగి పోతున్నా కారణాలు పట్టించుకుని చర్చించడం లేదు. వైద్య సేవల ధరలు భరించలేనంత విపరీతంగా పెరిగాయి. కార్పోరేట్ ఆస్పత్రుల దోపిడీతో సామాన్యులు కుదేలవుతున్నారు. వారిని ఎవ్వరూ పట్టించు కోవడం లేదు. మందుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నా పట్టించుకోవడం లేదు. అలాగే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు కూడా ఎప్పటికప్పుడు పెంచడంతో సామాన్యుల బతుకు భారంగా మారుతోంది. దీంతో సామాన్యులకు ఊరడింపు దక్కడం లేదు. పన్నుల భారం మోయలేక ప్రజల నడ్డి విరుగుతున్నది. కేంద్రం లోని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆర్థికరంగాన్ని నిలబెట్టేలా లేవు. ఎడాపెడా పన్నులు



విధించడంలో ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఊపిరాడని స్థితికి చేరింది. ఇదంతా ఒక ఎత్తయితే విదేశీ విద్య చదువుకోవాలనే విద్యార్థులకు డాలర్ మారకం తీరని భారంగా మారింది. ఉన్నత చదువులకు వెళ్లాల నుకునే వారికి డాలర్ మారకం 86 రూపాయలకు పైనే కావడంతో తట్టుకోలేక పోతున్నారు. ఫీజులను డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఫీజలు భారం తడిసి మోపెడు అవుతోంది. ఏటా వేలాది మంది మనదేశం నుంచి అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలకు వెళుతుంటారు. వీరికి డాలర్ ఒక్కటే శరణ్యం. డాలర్ రేటు పెరగడం వల్ల ప్రతి ఒక్క విద్యార్థిపై అదనపు భారం పడుతోంది. చదువుకుని తమకాళ్లమీద తాము నిలబడాలన్న లక్షలాది మంది విద్యార్థులకు ప్రభుత్వాల విధానాలు గుదిబండగా మారాయి. ఉన్నత చదువులు భారంగా మారుతున్నాయి. విదేశాలకు వెళ్లాలనుకున్న వారికి సవాల్‌గా మారింది. డబ్బున్నవాళ్లే చదువుకునేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. పేదలు, మధ్య తరగతి వాళ్లు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా విదేశాలకు వెళ్లి చదువుకునే పరిస్థితులు కానరావడం లేదు. ఇవన్నీ కూడా ఎన్‌డిఎ పక్షాలు చర్చించాలి. మోడీతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలి. ఇక్కడ ఇంజనీరింగ్, మెడిసిన్ పూర్తి చేసి లేదా ఇతర డిగ్రీలతో విదేశాలకు వెళ్లాలనుకున్న వారికి ప్రధానంగా రెండు సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకటి రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బ్యాంకులు సజావుగా స్పందించడం లేదు. నానా కొర్రీలు పెట్టడంతో యాతన పడాల్సి వస్తోంది. డబ్బున్న వారికి రుణాలు అందుతున్నాయి. కానీ పేదలు, మధ్య తరగతి వారికి రుణాలు ఇవ్వడం లేదు. ఇకపోతే రుణం పొందినా.. దాని వడ్డీ తడిసి మోపెడు అవుతోంది. విదేశాలకు వెళ్లి, చదువు పూర్తి చేసుకుని, ఉద్యోగం సంపాదించి వచ్చే సరికి రుణభారం మోయలేనంతగా పెరుగుతోంది. దీంతో సంపాదన అంతా చదువుకోసం తీసుకున్న రుణాన్ని వడ్డీతో సహా చెల్లించడానికే సరిపోతుంది. దీనికి తోడు విదేశీయానం కూడా భారంగా మారింది. ఇంధన ధరల వల్ల విమానరంగం టిక్కెట్లను అమాంతంగా పెంచేసింది. దీంతో అమెరికా తదితర దేశాలకు వెళ్లాలనుకున్న వారికి టిక్కెట్లు భారంగా మారాయి. విదేశీ విద్య కావచ్చు, దేశీయంగా చదువుకునే విద్య కావచ్చు..సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు స్వశక్తిమీద బతికేలా చేయాలి. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రుణాలను ఉదరాంగా ఇచ్చేలా చూడాలి. అప్పుడే మన యువత తమకాళ్లమీద తాము నిలబడగలుగుతారు.దేశీయంగా ఉన్నత చదువులు చదివే వారికి, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లేవారి కోసం ప్రత్యేక నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంకులు నామమాత్రపు గ్యారెంటీతో,నామమాత్రపు వడ్డీతో రుణాలు ఇచ్చేలా విధానాలు సరళీకరించాలి. అందుకు కేద్రం వడ్డీ భరించే పథకాన్ని ప్రవేశ పెడితే మరీ మంచిది. ఈ అంశాలను చర్చించే ధైర్యం ఎన్‌డిఎ పక్షాలు చేయకపోవడం దారుణం కాక మరోటి కాదు.

# హైవేలపై నిత్యకృత్యంగా ప్రమాదాలు

విజయవాడ,ఈ మధ్యరోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నాలుగు వరసల రోడ్లపైనా ప్రమాదాలు తప్పడం లేదు. అతివేగంతో పాటు, మలుపులు, సరైన సూచికలు లేకపోవడం, రోడ్ల మరమ్మత్తుల చేపట్టక పోవడంకూడా కారణంగా చెప్పుకోవాలి. ఎపిలోని పలు రోడ్లు మృత్యు మార్గాలుగా మారుతున్నాయి. తిరుపతి. ప్రకాశం, విజయనగరం, నెల్లూరు ఇలా ప్రతిచోటా ప్రమాదాలు నిత్యకృత్య మయ్యాయి. వీటితో పాటు కర్నూలు హైవే మృత్యుమార్గమైంది. తరచూ హైవే ప్రమాదాలు జిల్లాలో మామూలయ్యాయి. తరచూ ఎక్కడో ఒక చోట ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. ఘటన జరిగినప్పుడు తప్ప మళ్లీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడు తప్ప మిగతా సమయాల్లో అధికారులు పట్టించుకోవడం లేదు. హైవేపై వేగం నియంత్రణ నిబంధనలు పాటించక పోవడమే దీనికి కారణం. దీంతో భద్రత లేమి స్పష్టంగా కనిపిస్తోంది. అంతులేని వేగంతో వాహనాలు దూసుకెళ్లి రోడ్డు పైన నెత్తురు చిందుతున్నాయి. రహదారి నిబంధనలేవీ అమలు కావడం లేదు. ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. వెల్దుర్తి, డోన్, ప్యాపిలి ప్రాంతాల్లోని హైవేలో ఉన్న రహదారుల కూడళ్ల మలుపులు డేంజర్ జోన్లుగా మారిపోయాయి. జిల్లాలో 85 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్–44 ఉంది. కర్నూలు నుంచి వెల్దుర్తి, డోన్, ప్యాపిలి మీదుగా పోదొడ్డి వరకు జిల్లా హైవే రహదారి ఉంది. ఈ ప్రాంతాల్లోని రహదారుల కూడళ్ల మలుపులు డేంజర్ జోన్లయ్యాయి. డోన్ పరిధిలో ఆరు హైవే కూడళు ప్రమాదాల నిలయాలయ్యాయి. హైవేపై అతివేగంగా వాహనాలు దూసుకొస్తున్నాయి. నిబంధనల ప్రకారం హైవేపై వాహనాల వేగం 80 కిలోమీటర్లు మించరాదు. అయితే ఈ నిబంధనను వాహనాల డ్రైవర్లు అసలు పాటించడం లేదన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, వాహనాలు మితిమీరిన వేగంతో వస్తున్నాయి. హైవేపై వేగనియంత్రణ చేయాల్సిన ఎంవీఐ అధికారులు, హైవే అధికారులు మొద్దునిద్ర వీడటం లేదన్న విమర్శలున్నాయి. హైవేపై వాహనాల వేగాన్ని నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవలసివస్తోంది. హైవే అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. హైవేపై పాటించాల్సిన నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. హైవే మలుపుల వద్ద ప్రమాద సూచికబోర్డులు అసలు కనిపించడం లేదు. మలుపుల వద్ద వేగనియంత్రణ బోర్డులు అడ్రస్ లేవు. వీటికి తోడు హైవే జంక్షన్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు కూడా లేకపోవడంతో.. వాహనాలు వేగంగా దూసుకొస్తున్నాయి. అదే విధంగా హైవే జంక్షన్ల వద్ద తప్పనిసరిగా లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రిళ్లు హైవే జంక్షన్ల వద్ద లైటింగ్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

# హిమాచల్‌లో వరదలతో అతలాకుతలం

సిమ్లా,హిమాచల్‌లో కురుస్తోన్న భారీ వర్షాలతో మండి జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. కాగా.. రుతుపవనాల రాకతో జూన్ 20 నుంచి కురుస్తున్న వర్షాలకు హిమాచల్‌లో 70 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురి ఆచూకీ గల్లంతయిందని రాష్ట్ర విపత్త నిర్వహణ విభాగం వెల్లడించింది. భారత వాతావరణ విభాగం రాష్ట్రంలోని పది జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇదిలాఉంటే.. మండి జిల్లాలోని తునాగ్ ప్రాంతంలోని కోఆపరేటివ్ బ్యాంక్‌ను వరద నీరు ముంచెత్తిన సంగతి తెలిసిందే. అందులో ఉన్న బంగారం, నగదు ఏమైందో..? అని ఆందోళన వ్యక్తమవుతోంది. దాంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు కొట్టు–కొనిపోకుండా, దొంగల చేతిలో పడకుండా గ్రామస్థులు కాపలా కాస్తున్నారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో హిమాచల్ ప్రదేశ్ ప్రజల జీవితం దుర్భరంగా మారింది. ఎంతోమంది అయినవాళ్లను కోల్పోయి అనాథలుగా మారిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక కుక్క అరుపు.. 67 మంది ప్రాణాలను కాపాడింది. అక్కడి సియతి గ్రామంలో జూన్ 30న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పెద్ద కొండచరియ విరిగిపడింది. ఆ గ్రామస్థుడు ఒకరు మాట్లాడుతూ.. 'మా ఇంటి రెండోఅంతస్తులో ప్రతిరోజు ఓ శునకం నిద్ర పోతుంది. అయితే ఆరోజు ఉన్నట్టుండి అది విపరీతంగా అరవడం మొదలుపెట్టింది. మరోవైపు కుంభవృష్టి వర్షం కురుస్తోంది. ఆ అరుపుల శబ్దానికి నేను లేచి దాని దగ్గరకు వెళ్లాను. పైకి వెళ్లగా ఇంటిగోడకు పగుళ్లు కనిపించాయి. ఇంట్లోకి నీరు రావడం మొదలైంది. దాంతో వెంటనే కుక్కను కూడా కిందికి తీసుకెళ్లి, అందరినీ నిద్ర లేపాను. ఇంటి చుట్టుపక్కల వాళ్ల ఇళ్లకు వెళ్లి వారిని కూడా లేపి, సురక్షిత ప్రాంతానికి వెళ్లమని చెప్పాను. అలా దూరంగా వెళ్లామో, లేదో.. మా గ్రామంపై కొండచరియ విరిగిపడింది. పదుల సంఖ్యలో ఇళ్లు దానికింద నేలమట్టం అయ్యాయి. ఒక నాలుగైదు ఇళ్లు మాత్రం దెబ్బతినకుండా కనిపించాయని ఆయన వెల్లడించారు. ఇళ్లు ధ్వంసం కావడంతో గ్రామస్థులంతా తియంబాలా గ్రామంలోని నైనాదేవి ఆలయంలో ఆశ్రయం పొందుతున్నారు. సర్వం కోల్పోవడంతో అంతా నిరాశలో మునిగిపోయారు. కొందరు హైబీపీతో బాధ పడుతున్నారు.

# ఎక్కడికి వెళ్లిన మనుషులను చంపడమేనా

నెల్లూరు, ప్రతిపక్షంలో ఉన్నా మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డిలో మార్పు రాలేదని, ఇప్పటికీ హెలికాప్టర్లలోనే తిరుగుతున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం నెల్లూరు పట్టణ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో మంత్రి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఎక్కడికి వెళ్లినా మనుషుల్ని చంపుకుంటూ వెళ్తున్నారని.. పల్నాడు జిల్లా పర్యటనలో ఒకరిని పరామర్శించడానికి వెళ్లి ముగ్గురిని చంపారని మండిపడ్డారు. 'జనసమీకరణ మనం చేయలేక కాదు.. మనవల్ల ప్రజలు ఇబ్బంది పడకూడదు. కార్యకర్త కారు కిందపడితే కనీసం దిగి చూడలేదు. దిగి చూసి ఆసుపత్రికి పంపించి ఉంటే బతికేవాడు. బాధిత కుటుంబం తల్లిని తీసుకువచ్చి కనీసం కూర్చోపెట్టలేదు. గ్లాస్ మంచినీరు అయినా ఇచ్చారా? సొంత కార్యకర్త చనిపోతే నిల్చొని రెండు భుజాలు తట్టి వెళ్లిపోయారు' అంటూ ఫైర్ అయ్యారు. వైసీపీ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. బ్లేడ్ బ్యాచ్‌ను, గంజాయి బ్యాచ్‌ను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ హయాంలోనే 164 మంది కార్యకర్తలను చంపారని.. అప్పుడే భయపడలేదని.. రప్పా, రప్పాకు భయపడతామా అని అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు ఇంటి గేటు–కు తాళ్లు కట్టారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరి–కై–నా తిరిగే హక్కు ఉందన్నారు. కానీ తిరగమంటే మనుషులను చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించమంటే ఎదురుదాడి చేస్తున్నారన్నారని మంత్రి లోకేష్ ఫైర్ అయ్యారు.

# కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ చతుర్ముఖ వ్యూహం!




హైదరాబాద్, పదేళ్లు అధికారంలోకి ఉండి.. అమలు చేసిన పథకాలు.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'బంధు' పథకాలు తమకు గెలుపు సోపానాలు అనుకుంది బీఆర్ఎస్ నాయకత్వం. ఎన్నికల్లో ప్రతిపక్షాల కట్టడికి ఫోన్ ట్యాపింగ్‌తో చేసిన దిగ్భంధం చేశారన్న అరోపణలూ వచ్చాయి. మొత్తంగా తెలంగాణలో మరోసారి తమదే అధికారమన్న ధీమా చూపారు. అయితే ప్రశ్నించే నైజం.. అణచి వేతపై తిరుగుబాటు తత్వం.. స్వేచ్ఛనే శ్వాసగా భావించే తెలంగాణ సమాజం మాత్రం కల్వకుంట్ల కుటుంబం పద్మవ్యూహాలను ఛేదించి, బీఆర్ఎస్ ను ఓడించి, దిమ్మ దిరిగే తీర్పుతో ప్రగతి భవన్ నుంచి ఫామ్‌హౌస్ బాట పట్టించారు. స్వతంత్ర భారత దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిర్భంధాలు, కుట్రలు, జనాకర్షక ఎత్తుగడలకు ఎన్నికల సమరంలో తెలంగాణ సమాజం ఇచ్చిన తీర్పు ప్రజాస్వామిక విప్లవాలన్నింటిలోనూ విలక్షణమైనదిగా రాజకీయ పరిశీలకులు అప్పట్లోనే అభివర్ణించారు. ప్రజాతీర్పును విశ్లేషించుకుని సరికొత్త విధానాలతో జనాభిమానం కోసం ప్రయత్నించాల్సిన బీఆర్ఎస్ నాయకత్వం మాత్రం నిత్యం ఏదో రూపంలో ప్రజలే తమను తిరస్కరించి తప్పు చేసినట్లుగా అసహనం వెళ్లగక్కుతుండటం గమనార్హం. ఈ క్రమంలో అధికారం కోల్పోయిన మొదటి నుంచే అధికార కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. తమ ప్రగతి భవన్ పాలన కాలమంతా తెలంగాణ ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి యుగమనట్లుగా.. కాంగ్రెస్ పాలనంతా అవినీతి, అక్రమాలు, అణచివేతల మయమంటూ నిత్యం విమర్శలు గుప్పిస్తున్నారు.

**ఆ ముగ్గురే..**

అధికారంలో ఉన్న మాదిరిగానే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవిత.. ప్రభుత్వంపై విమర్శల దాడిలో చట్టసభలలోనూ.. బయట కూడా కనిపిస్తున్నారు. అడపదడపా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఉనికి కోసమన్నట్లుగా ప్రెస్ మీట్ పెడుతున్నారు. పార్టీలో ఆధిపత్య పోరును తలపించేలా.. ఏకంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను మరిపించేలా నిత్యం కేటీఆర్, హరీష్ రావు, కవితలు కుదిరితే ప్రెస్ మీట్‌లలో.. లేకపోతే ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై పోటీపడి విమర్శలు కురిపిస్తున్నారు. వారు ముగ్గురితో పాటు బీఆర్ఎస్ సోషల్ మీడియా అటాక్ మరోవైపు నిత్యం కొనసాగుతునే ఉంది. ప్రభుత్వం ఎప్పుడు ఏ తప్పటడుగు వేస్తుందో చూస్తూ వారంతా నలువైపులా విమర్శల దాడి చేస్తున్నారు. ఈ క్రమంలో మరోసారి రైతాంగ సమస్యలపై కేటీఆర్, కవిత, హరీష్ రావులు ఎక్స్ వేదికగా విమర్శలు సంధించారు. కాంగ్రెస్ సర్కార్ పై నిత్యం విమర్శలతో విరుచకపడుతున్న ఆ ముగ్గురి తీరు చూస్తే ఇప్పటికిప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చేయాలన్న తాపత్రాయం కనిపిస్తుందని..కాకపోతే వారి ఆత్రం..ఆరాటం..జనానికి కూడా ఉందని వారు భ్రమపడుతున్నారని విపక్షాలు సైటర్లు సంధిస్తున్నాయి.

**ఇది నో స్టాక్ సర్కార్ : కవిత**

రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతపై కేటీఆర్, కవిత, హరీష్ రావులు ఎక్స్ వేదికగా విమర్శలు సంధించారు. కవిత తన ఎక్స్ ఖాతాలో ఇది నో స్టాక్ సర్కారు అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాజుగా బతికిన రైతును కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రోడ్డు పాలు చేసిందన్నారు. పోలీస్ స్టేషన్లలో ఎరువులు, విత్తనాలు అమ్మిన చరిత్రను రిపీట్ చేసిందని..ఇప్పుడు ఎక్కడ చూసినా యూరియా కోసం భారీ క్యూ లైన్లే కనిపిస్తున్నాయని విమర్శించారు. యూరియా మాత్రమే కాదు డీఏపీ, పొటాష్ కోసమూ రైతులకు తిప్పలు పడుతున్నారని.. ముగ్గురు మంత్రులున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల పరిస్థితి మరీ ఘోరం అన్నారు.వానాకాలం సీజన్ మొదలై నెల రోజులు గడిచిన తర్వాత కూడా ఎరువుల కొరత రైతులను వేధిస్తున్నది అంటే సర్కారు ముందు చూపులేనితనం ప్రణాళికబద్ధంగా వ్యవహరించకపోవడమే కారణం అని ఆరోపించారు.

**కాంగ్రెస్ పాలనలో మళ్లీ ఎరువుల కరువు : కేటీఆర్**

కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా లేదు, రైతు రుణమాఫీ లేదని..కనీసం అప్పు తెచ్చి వ్యవసాయం చేద్దామంటే ఆఖరికి ఎరువులకు కూడా కరువొచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. మీరు అడిగినట్టు ఆధార్ కార్డులు ఇచ్చినా, రైతుకి కనీసం బస్తా ఎరువు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఎందుకుంది? అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఎందుకుందని రైతులకు వివరించాలన్నారు కేటీఆర్. రూ.266.50 ఉండాల్సిన బస్తా యూరియా ధర ఇప్పుడు రూ.325 ఎలా అయ్యిందో రైతులకే కాదు రాష్ట్ర ప్రజలకు మొత్తం తెలియలన్నారు. ఈ బ్లాక్ మార్కెట్ దందాను దగ్గరుండి నడిపిస్తుంది ఎవరు?..ఈ కృత్రిమ కొరత ఎవరివల్ల ఏర్పడుతుందో, ఆఖరికి ఎరువులను కూడా బుక్కేస్తున్న మేతన్నలు ఎవరో వెంటనే విచారణ జరిపించాలన్నారు.

**కేసీఆర్ పాలనే రైతన్నకు భరోసా: హరీష్ రావు**

కేసీఆర్ పదేళ్ల పాలనే రైతాంగానికి భరోసా కాలమని..వ్యవసాయం పండగలా మారిందని మాజీ మంత్రి టి.హరీష్ రావు ఎక్స్ వేదికగా గుర్తు చేశారు. పదేళ్లలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు సాయం, రైతు రుణమాఫీ, యూరియా, నాణ్యమైన విత్తనాల సరఫరా, రైతువేదికల నిర్మాణం, మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులు, పెరిగిన భూగర్భ జలాలు.. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరాతో పాటు రైతు కుటుంబాల సభ్యులకు అందిన సంక్షేమ పథకాలతో రైతులకు మేలు జరిగిందని వివరించారు.

## నెలాఖరుకు ఘోష్ నివేదిక!

హైదరాబాద్ : కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్, అనుబంధ ప్రాజెక్టులపై విచారణ తుది అంకానికి చేరిన సమయంలో జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ మాజీ ఇఎన్సి అనిల్ కుమార్ విచారణకు పిలిచినట్లు తెలిసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ గతేడాది పార్లమెంట్ ఎన్నికలు జరిగిన తరువాత విచారణ వేగం పెంచారు. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై ఇప్పటికే సమగ్ర విచారణ చేపట్టారు. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన ఇంజినీర్లు, ఉన్నతాధికారుల నుంచి అఫిడవిట్లు తీసుకుని వాటి ఆధారంగా వారిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అదేవిధంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, అంశాలపై మాజీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్ రావు మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్లను కూడా కమిషన్ విచారించింది. ఈ క్రమంలోనే మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ నీటి పారుదల శాఖ మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్ తాజాగా కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేసింది. మేడిగడ్డ బ్యారేజీ లో గ్రౌండింగ్ విషయాన్ని ఎంక్వైరీలో భాగంగా దాచిపెట్టిన విషయాన్ని కమిషన్ గుర్తించింది. అదేవిధంగా ఉన్నత హోదాలో ఉండి అబద్ధపు స్టేట్మెంట్ ఇచ్చినందుకు ఆయనపై చైర్మన్ పినాకిని చంద్రఘోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు నీటిపారుదలశాఖలో చర్చించుకొంటున్నారు. దీంతో ఆయనకు నోటీసులు ఇచ్చి ఈనెల 9న తిరిగి విచారణకు రావాలని కమిషన్ ఆదేశించింది.

కాళేశ్వరం నివేదిక తుది దశలో ం ఈ నెల 27న ప్రభుత్వానికి సమర్పణ అదేవిధంగా కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్, అనుబంధ ప్రాజెక్టులకు సంబంధించి గత ప్రభుత్వ కేబినెట్ మినిట్స్ తనకు అందినట్లుగా కమిషన్ కార్యాలయం తెలిపింది. ఈనెల 27న కాళేశ్వరం కమిషన్ తుది నివేదకను ప్రభుత్వానికి అందజేయనుంది. మధ్యాహ్నం కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీ చంద్రఘోష్ బీఆర్కే భవన్కు చేరుకున్నారు. కాళేశ్వరం ఆనకట్టల అంశాలపై అధ్యయనం చేయనున్నారు. అదేవిధంగా పలు ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం సంబంధిత విషయాలను క్షుణ్ణంగా పరిశీలంచనున్నారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ నివేదిక దాదాపు సిద్ధమైంది. ఈ నెలాఖరులోగా ప్రభు త్వానికి అందించే అవకాశముంది. విచారణలో భాగంగా ఇప్పటి వరకు మొత్తం 115 మందిని కమిషన్ ప్రశ్నించి, వాంగ్మూలాలను నమోదు చేసింది. అంతేకాకుండా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అందించిన వివరాలను కూడా క్రోడీకరించి పూర్తి నివేదికను సిద్ధం చేసి, ఈ నెలాఖరు కల్లా ప్రభుత్వానికి అందించనుంది.

**అనిల్ కుమార్ పై విచారణ ఎందుకు జరుగుతుంది?**

మేడిగడ్డ బ్యారేజీ లోపాలు, గ్రౌండింగ్ సమాచారం దాచిన అంశం, అలాగే అధికార హోదాలో అబద్ధపు స్టేట్మెంట్ ఇచ్చిన కారణంగా మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్‌పై విచారణ జరుగుతోంది. జస్టిస్ పీ. చంద్రఘోష్ కమిషన్ ఈ విషయాలపై తీవ్రంగా స్పందించి నోటీసులు జారీ చేసింది.

**ఘోష్ నివేదిక అంటే ఏంటి ?**

ఘోష్ నివేదిక అంటే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ తుది నివేదిక.ఈ నివేదికలో ప్రాజెక్టు లోపాలు, బాధ్యులు, నష్టాలపై వివరాలు ఉండే అవకాశం ఉంది.

## గవర్నర్ పర్యటనతో పలువురు విద్యార్థి నేతల అరెస్ట్

వరంగల్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం వరంగల్ జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా కొంత ఉద్రిక్తత ఏర్పడింది. కాకతీయ యూనివర్సిటీ- 23వ స్నాతకోత్సవం సందర్భంగా పలువురు విద్యార్థి సంఘాల నేతలను ముందస్తుగా వరంగల్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. గవర్నర్ పర్యటనను అడ్డుకుంటారన్న అనుమానంతో ఆదివారం అర్ధరాత్రి పలువురు విద్యార్థి సంఘాల నేతలను అరెస్ట్ చేశారు. వారిని కాకతీయ యూనివర్సిటీలోని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. విద్యార్థి సంఘాల నేతలను అరెస్ట్ చేయడంతో వరంగల్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మీడియాతో మాట్లాడారు. తమను అక్రమంగా నిర్బంధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అసలు కారణాలు ఇవేనా?

హైదరాబాద్,రెండు పార్టీల అగ్రనేతలను ఓడించిన లీడర్ ఆయన. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో పాపులరైన ఆ నేత.. గత కొన్ని రోజులుగా చాలా సైలెంట్‌గా ఉంటున్నారట. పార్టీ కార్యక్రమాల్లోనూ ఓ మాదిరిగానే పాల్గొంటున్నారట. ఇలాంటి పరిస్థితుల్లోనే.. ఇటీవలె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమానికీ హాజరు కాలేదట. అసలు ఎందుకీ పరిస్థితి..? కమలంలో ఏం జరుగుతోంది..?కాటిపల్లి వెంకటరమణారెడ్డి. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు ఆయన రేంజ్ ఒకలా ఉంటే.. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మరోలా మారిపోయింది. నిజమే.. ఇందులో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు కాటిపల్లి. అయితే.. ఇదేదో సాధారణ విక్టరీ అయ్యుంటే ఇంతగా మాట్లాడుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. హోరాహోరీగా సాగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి హేమాహేమీలైన అభ్యర్థులు బరిలో దిగారు. బీఆర్ఎస్ నుంచి గులాబీ బాస్ కేసీఆర్ పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రేవంత్ రెడ్డి బరిలో దిగారు. కానీ, వీరిద్దరిపై పైచేయి సాధించి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేశారు కాటిపల్లి వెంకటరమణారెడ్డి.

**రాష్ట్రస్థాయి కార్యక్రమాలకు దూరంగా వెంకటరమణారెడ్డి**

జెయింట్ కిల్లర్‌గా కామారెడ్డి నుంచి విజయం సాధించడంతో కాటిపల్లి పేరు రాష్ట్ర వ్యాప్తంగా మార్మోగింది. అలాంటి నేత మొదట్లో బాగానే ఉన్నా.. గత కొంత కాలంగా ఆయన పేరు గట్టిగా విన్పించడం లేదన్న కామెంట్లు వస్తున్నాయి. పార్టీ కార్యక్రమాలకు కొన్ని రోజుల పాటు అందుబాటులో లేరు కాటిపల్లి. ఎక్కడా ఆయన పేరు సైతం సరిగా విన్పించని పరిస్థితి. ఇప్పుడిప్పుడే మళ్లీ నియోజకవర్గంలోని కార్యక్రమాలకు హాజరవుతున్న ఆయన.. రాష్ట్రస్థాయిలో జరిగే కార్యక్రమాలపై పెద్దగా స్పందించడం లేదన్న అభిప్రాయం కార్యకర్తల్లోనే విన్పిస్తోంది.

**రామచంద్రరావును కలిసేందుకు సైతం రాని కాటిపల్లి..!**

ఎక్కడిదాకో ఎందుకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు రామచంద్రరావు. ఇలాంటి వేళ కనీసం నూతన అధ్యక్షుడ్ని విష్ చేసేందుకు సైతం ఆయన రాకపోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. కమలం పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న కాటిపల్లి ఎందుకు రాలేదు..? నియోజకవర్గంలో అంత పని ఏం ఉంది..? అయినా ఎంత వర్క్ ఉన్నా.. పార్టీకి నూతన అధ్యక్షుడు వచ్చినప్పుడు కనీసం వచ్చి కలవడం అనేది నేతలు సర్వసాధారణంగా చేసే పని. మరి ఆ రకంగా చూసినా ఆయన ఎందుకు రాలేకపోయారు అన్న ప్రశ్న తలెత్తుతోంది.

**గతంలో ఎంతో యాక్టివ్‌గా కన్పించిన వెంకట రమణారెడ్డి**

వాస్తవానికి కొన్ని నెలల క్రితం కాటిపల్లి పార్టీలో ఎంతో యాక్టివ్‌గా కన్పించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటామన్నారు. హైడ్రా కూల్చివేతలకు వ్యతిరేకంగా గళమెత్తారు. అసలు కార్పొరేట్ల కోసమే ఈ కూల్చివేతలు అంటూ అందుకు సంబంధించిన ఆధారాలు సైతం తన

## మదనపల్లె దస్త్రాల దహనం కేసులో ఆర్డీవో అరెస్ట్

మదనపల్లె,అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన దస్త్రాల దహనం కేసులో మాజీ ఆర్డీవో మురళిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు.అనంతరం సుప్రీంకోర్టు ఆదేశానుసారం బెయిల్‌పై విడుదల చేశారు.

# కార్పొరేట్ రంగానికి కేంద్రం జీహుజూర్!

న్యూఢిల్లీ,కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, దాని సైద్ధాంతిక భూమిక అయిన ఆర్ఎస్ఎస్ ఆదేశాల ప్రకారం కార్పొరేట్ పెట్టుబడిదారీ శక్తుల అనుకూల పరిపాలన సాగిస్తున్నది.2019లో రెండోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ అనేక ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేయటమేకాకుండా, దానికనుగుణంగా చట్టాలను రూపొందిస్తూ వస్తున్నది. మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల అధికారాల్ని హరించి వస్తువుల, సర్వీసుల పన్ను (జిఎస్‌టి) చట్టాన్ని తీసుకొచ్చారు. జిఎస్‌టి చట్టం మూలమున రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు మున్సిపాలిటీ స్థాయికి దిగజారిపోయాయి. భారత రాజ్యాంగంలో చెప్పిన ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా ఈ చట్టం ఉన్నది.ఆ తరువాత రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ), జాతీయ పౌరసత్వ పట్టిక (ఎన్ఆర్‌సి) బిల్లును, ఎన్‌పిఆర్ చట్టాలను తీసుకొచ్చింది. అదేవిధంగా భారత రాజ్యాంగంలో కశ్మీర్‌కు ఇచ్చినటువంటి స్వయం ప్రతిపత్తి 370, 35ఎ ఆర్టికల్స్‌ను రద్దు చేసింది. భారతదేశంలో ఇస్లాం ఫోబియాను రెచ్చగొట్టి మైనారిటీ ముస్లింలపై దారుణ మారణకాండ జరపటం దాని ఉద్దేశం. 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన మరుసటి దినం ఆర్ఎస్ఎస్ అధినేతలు డా. బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పడిన భారత రాజ్యాంగాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, భారత రాజ్యాంగంగా మనస్మృతి ఉండాలని, అదే తమ అభిమతమని వారు ఉద్ఘాటించారు.భారత రాజ్యాంగ ప్రవేశికలో చెప్పినట్లుగా భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, ప్రజాతంత్ర, లౌకిక, గణతంత్ర రాజ్యంగా తాము ఒప్పుకోవటం లేదని వారు అనేక సందర్భాల్లో ఘంటాపథంగా చెప్పారు. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే చట్టం పేరుతో భారతదేశాన్ని హిందూ దేశంగా లేదా హిందూ రాజ్యంగా ఏర్పడాలని ఆర్ఎస్ఎస్ ఉద్దేశమని వారు పదేపదే చెప్పారు. పూర్వం 'జనసంఘ్' రాజకీయ పార్టీయే నేటి 'భారతీయ జనతా పార్టీ'. భారతీయ జనతా పార్టీ ఏర్పడినప్పుడు గాంధీ సోషలిజం తమ లక్ష్యం అన్నారు. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (1973) కేసులో సుప్రీం కోర్టు ధర్మాసనం భారత పార్లమెంటుకు రాజ్యాంగాన్ని సవరణ చేసే అధికారం ఉన్నదనీ, అయితే పార్లమెంటు చేసే చట్టాలు రాజ్యాంగ మౌలిక స్వభావానికి లోబడి ఉండాలని, భిన్నంగా ఉండరాదని తీర్పు చెప్పింది.ఇటీవల ఆ పార్టీ నాయకులు అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ప్రవేశికలో 'సోషలిస్టు, సెక్యులర్' అనేటువంటి పదాలు లేవని పదేపదే చెబుతున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబాలే బహిరంగ ప్రకటన కూడా ఇచ్చారు. సుప్రీం కోర్టును కూడా ప్రభావితం చేసి బాబ్రీ మసీదు కేసులో తీర్పు వచ్చిన తీరును మనం చూసాం. అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజని గోగోయ్‌కి రాజ్యసభ సభ్యత్వం, మరో సుప్రీం కోర్టు న్యాయమూర్తి నజీర్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ పదవి పొందారు. భవిష్యత్తులో భారత రాజ్యాంగం మౌలిక స్వభావాన్ని కూడా పార్లమెంటు మార్చవచ్చు అనే తీర్పు వచ్చినా మనం ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. భారతీయ జనతా పార్టీకి మాతృసంస్థ అయినటువంటి రాష్ట్రీయ స్వయం సేవక సంఘానికి హిందూ రాష్ట్ర ఎజెండా ఉన్నది. భారతీయ జనతా పార్టీ ఆర్ఎస్ఎస్ హిందుత్వ ఎజెండాకు అనుగుణంగా పరిపాలన సాగిస్తూ వస్తున్నది.1991లో పివి నరసింహారావు నేతృత్వంలో తీసుకొచ్చిన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్ పిజి) నయా ఉదారవాద విధానాలు బిజెపి ప్రభుత్వం మరింతగా అమలు చేస్తున్నది. అంబానీ, అదానీ లాంటి ఆశ్రితపక్షపాతులకు, కార్పొరేట్ దిగ్గజాలకు దేశసంపదను అప్పజెప్పటానికి మొత్తం ప్రభుత్వరంగ పరిశ్రమలన్నిటినీ ప్రైవేటీకరణకు పూనుకున్నది. అందుకనుగుణంగా అనేక చట్టాలను మారుస్తూ వస్తున్నది. అందులో భాగంగానే మూడు వ్యవసాయ నల్లచట్టాలను తీసుకొచ్చి మొత్తం



వ్యవసాయ ఉత్పత్తులన్నిటిని అంబానీ, అదానీలకు వ్యాపార సరుకుగా చేయటానికి పూనుకున్నది. ప్రధాన నరేంద్ర మోడీ అమెరికా సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా ఉంటూ, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా భారతదేశ చట్టాలను మారుస్తున్నారు అనే విషయాన్ని మనం ఇక్కడ దృష్టిలో పెట్టుకోవాలి.దీనిని భారతదేశ రైతాంగం, ప్రధానంగా ఉత్తర భారత రైతాంగం ముందు భాగాన నిలబడి దేశ రాజధాని ఢిల్లీ నగరంలో తిష్ట వేసుకుని ఆ చట్టాలను వెనక్కి తీసుకునేంతవరకు సంవత్సర కాలంపైగా దీర్ఘకాలం పోరాటం చేశారు.ఈ సందర్భంలో రైతు సంఘాలతో చేసుకున్న ఒడంబడికను నేటి వరకు అమలు చేయలేదు. అదే సమయంలో 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను 2020 సంవత్సరంలో తీసుకొచ్చారు. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ నాటినుండి నేటి వరకు కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాన, వామపక్ష పార్టీల నాయకత్వాన సుదీర్ఘమైన పోరాటంచేస్తూ ఉన్నారు. ఆశ్రితపక్షపాత పెట్టుబడిదారులకు ప్రభుత్వరంగ పరిశ్రమలను, జాతి సంపదను అప్పజెప్పటమే కాకుండా దానికనుగుణంగా గత 100 సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయాలనే దుష్టతలంపుతో 29 చట్టాలను రద్దు పరిచి నాలుగు లేబర్ కోడ్‌లను తయారు చేసింది.మొదటిది, 2019 వేతనాల కోడ్ అమలులోకి వస్తే జాతీయ కనీస వేతనం పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలు (పేమెంట్ ఆఫ్ వేజెస్)వేతనాలు నిర్ణయించే అధికారాన్ని కోల్పోతాయి. కనీస వేతనాలు (మినిమం వేజెస్) రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో అమలయ్యే అవకాశం ఉండదు. ఓవర్ టైం చేసినందుకు కానీ, సమాన పనికి సమాన వేతనం గాని కోరే హక్కును కార్మిక వర్గం కోల్పోతుంది. రెండవది, 2020 పారిశ్రామిక సంబంధాల కోడ్ అమలులోకి వస్తే సమ్మె హక్కు కోసం కార్మిక వర్గం చాలా కష్టాలు ఎదుర్కోవాలి వస్తుంది. ఈ కోడ్‌లో కార్మికులు సమ్మె చేయటానికి అనేక ఆటంకాలు కల్పించారు. 100 మంది కన్నా తక్కువ మంది కార్మిక సంస్థల్లో పని చేస్తుంటే వారిని పైనుండి తొలగించటం సులభతరం అవుతుంది. పరిశ్రమల్లో కార్మిక సంఘాల ఏర్పాటు కష్టభూయిష్టమవుతుంది.మూడవది, 2020 వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ వల్ల పది మంది కంటే తక్కువ కార్మికులు పనిచేసే కంపెనీలలో కార్మికుల ప్రాణాలకు భద్రత ఉండదు. కాంట్రాక్ట్ కార్మికులు రక్షణ కోల్పోతారు. గిగ్, ఫ్లాట్, ఫారం, కార్మికుల రక్షణపై సరైన నిబంధనలు రూపొందించలేనందున వారికి రక్షణ కరువవుతుంది. నాల్గవది, 2020 సామాజిక భద్రత కోడ్ అమలులోకి వస్తే ఎవరికైనా ప్రభుత్వం మినహాయింపులు ఇచ్చే అవకాశం వస్తుంది. అందువల్ల యాజమాన్యం ఇఎస్ఐ, పిఎఫ్‌లు, గ్రాడ్యుటి కవరేజ్ లేకుండా ఉంటుంది. కార్మికులకు ఏ అవకాశం ఉండదు. కేంద్ర ప్రభుత్వంలో పనిచేసే కోటి మంది పైబడిన స్కీం వర్కర్లకి ఈ కోడ్ వల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది.

## ఉమ్మడి జిల్లాలకుపార్టీ ఇన్‌చార్జీల నియామకం

హైదరాబాద్, సంస్థాగత నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా ఇంఛార్జులను టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. సోమవారం జిల్లా ఇంఛార్జులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీ-పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, 10 ఉమ్మడి జిల్లాల ఇంఛార్జులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి విధానాలను మీనాక్షి వెల్లడించారు. త్వరలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణం ఉంటుందని చెప్పారు. వెంటనే రంగంలోకి దిగాలని ఏఐసీసీ ఇంఛార్జ్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను టీ-పీసీసీ చీఫ్ నియమించిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా ఉమ్మడి జిల్లా ఇంఛార్జులను టీ-పీసీసీ చీఫ్ ప్రకటించారు. ఉమ్మడి జిల్లాల ఇంఛార్జులుగా వంశీచంద్ రెడ్డి - ఖమ్మం, సంపత్ కుమార్ - నల్లగొండ, అడ్లూరి లక్ష్మణ్ - వరంగల్,పొన్నం ప్రభాకర్ - మెదక్, జగ్గారెడ్డి - హైదరాబాద్, కుసుమ కుమార్ - మహబూబ్‌నగర్, అనీల్ యాదవ్ - ఆదిలాబాద్, అద్దంకి దయాకర్ - కరీంనగర్, అజ్మతుల్లా హుస్సేన్ - నిజామాబాద్‌కు నియమితులయ్యారు.

## రిజర్వాయర్లకు చేరని వాననీరు

ఆదిలాబాద్, ఈ యేడు జిల్లాలో సాధారణ వర్షపాతమే కనిపిస్తుంది. వానాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచి పోయిన అంతంత మాత్రంగానే వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి స్వల్పంగానే వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో చేప పిల్లలను వదలడం సాధ్యపడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆశించిన స్థాయిలో చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు కనిపించడం లేదు. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవక పోవడంతో ఆశించిన స్థాయిలో వరదనీరు రావడం లేదు. భారీ వర్షాలు కురుస్తే కానీ ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఈ ఏడు ఇప్పటి వరకు మోస్తారు స్థాయిలోనే వర్షాలు కురుస్తున్న భారీ వర్షాల జాడ కనిపించడం లేదు. బిఆర్ఎస్ హయాంలో ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసినా పెద్దగా ఫలితం కానరాలేదు. ఈ ఏడాది కూడా చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు పంపిణీ చేస్తారా లేదా అన్న అనుమనాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 68 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో మత్స్యశాఖ పరిధిలో 62 చెరువులు, గ్రామ పంచాయతీ పరిధిలో 220, మరో రెండు రిజర్వాయర్లు ఉన్నాయి. చెరువులు, కుంటల్లో 35-40మి.మీ. సైజు రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో 80-100 మి.మీ. సైజు చేప పిల్లలను వదలనున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు రిజర్వాయర్లలో రొయ్య పిల్లలను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసారు. మొత్తం 68 సొసైటీల పరిధిలో 4230 మంది మత్స్యకార్మికులు ఉన్నారు. పెంచిన చేపలను మార్కెట్‌కు తరలించి విక్రయించేం దుకు కార్మికులకు వాహనాలు, వలలను సబ్సిడీపై ప్రభుత్వమే అందించింది. అయితే ఈ వ్యవహారంలో అంతా అవినీతి చోటుచేసుకుందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది కూడా చేప పిల్లలను వదిలేందుకు అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటనా చేయయలేదని అంటున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే మరిన్ని చెరువులు, కుంటలలో చేప పిల్లలను పెంచాలని మత్స్యకారులు భావిస్తున్నారు. స్థానికంగా మంచి డిమాండ్ ఉన్న కట్ల, రోకు, బొచ్చ, బంగారుతీగ లాంటి చేప పిల్లలను సరఫరా చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో చేపల మార్కెట్‌ను నిర్మించేందుకు స్థలాలను గుర్తించి ఇస్తామని గత సర్కార్ ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. జిల్లాలో అందుబాటులో ఉన్న రిజర్వాయర్, ప్రాజెక్టులలో రొయ్యల పెంపకం పై అధికారులు ప్రత్యేక దృష్టిని సారిస్తే ఉపాధి పురుగుతుందని అంటున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు, చిక్‌మాన్ ప్రాజెక్టులలో చేప పిల్లల పెంపకంతో పాటుయ్యల పెంపకంపై దృష్టి సారించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఏడాదంతా సరిపడా నీటి నిల్వలు ఉండే అవకాశం ఉండడంతో రొయ్యల పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. అలాగే మార్కెట్‌లో రొయ్యలకు మంచి డిమాండ్ కూడా ఉండడమే వీటి పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. రొయ్యల పెంపకంతో మత్స్య కార్మికులకు 3 కాలాల పాటు ఉపాధి దొరకడంతో పాటు అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. కానీ చేపలు పెంచే రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో రొయ్యలను పెంచితే సరైన దిగుబడులు రావని మత్స్యకార్మికులు పేర్కొంటున్నారు.

## 2047 నాటికి ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం


అమరావతి, 2047 నాటికి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన దిశగా కూటమి ప్రభుత్వం వ్యూహాలు రూపొందించిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఏడాది పాలనలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చామని మంగళవారం నాడిక్కడ అన్నారు. ప్రసవ సమయంలో మాతృ మరణాలు, శిశు మరణాలు, ఆరోగ్య భద్రత విషయాల్లో రాష్ట్రంలో పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. ప్రసూతి మరణాలను 45 శాతం నుండి 5 శాతానికి, శిశు మరణాలను 24 శాతం నుండి 2 శాతం కు తగ్గించాలని, గర్భస్థ మహిళల్లో బలహీనులుగా ఉన్నవారిని 34 శాతంనుంచి 4 శాతానికి తగ్గించే లక్ష్యాలను రూపొందించామన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా వైద్య రోగ్య శాఖ పరిధిలో పారదర్శకంగా, వివాదరహితంగా జరిగిన బదిలీలు కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలో తెచ్చిన మార్పునకు సంకేతమన్నారు. గత ప్రభుత్వ కాలంలో జరిగిన బదిలీలపై పలు అవినీతి, అక్రమాలు, రాజకీయ జోక్యంపై పలు ఆరోపణలు వచ్చాయని, కూటమి ప్రభుత్వం స్పష్టమైన నియమ నిబంధనలతో వాటికి అడ్డుకట్ట వేసిందన్నారు.గత ఐదేళ్ల ప్రభుత్వ నిర్వాకాలు, నిర్లక్ష్యంతో ప్రజారోగ్య రంగం గాడి తప్పిందని, అస్తవ్యస్తమైన వైద్య రంగాన్ని కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పాలనలో తిరిగి పట్టాలెక్కించిదన్నారు. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన విషయాల్లో గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వెల్లడించారు. ఆ ఐదేళ్ళ కాలంలో ప్రజారోగ్య రంగంలో జవాబుదారీతనం లేకపోవడం, క్రమ శిక్షణా రాహిత్యం, అవినీతి, రాజకీయ జోక్యం వలన వైద్య వ్యవస్థ దెబ్బతిందని, కూటమి ప్రభుత్వం ఈ పరిస్థితిని చక్కదిద్ది మార్పు తేగలిగిందన్నారు. దానివల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ సేవలు ఎంతో పెరిగాయన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు అవసరమైన మేరకు ప్రజారోగ్యాన్ని ప్రక్షాళించటంలో చేయవల్సినది చాలా ఉందని, ఆ మేరకు చర్యలు చేపట్టడానకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆసుపత్రుల నిర్వహణ అధ్వాన్నంగా ఉండటంతో పాటు సరిగా తమ విధులను కూడా నిర్వర్తించని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో సమీక్షలు చేసి వాటిని సరిదిద్దామన్నారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి, ప్రజల ఆరోగ్యానికి నడుమ అవినాభావ సంబంధం ఉందని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు శ్రమించే వైద్యులను సమాజంలోని అన్ని వర్గాల వారు గౌరవించాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ కోరారు. ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరిని కూటమి ప్రభుత్వం సహించదని, అట్టివారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది పనితీరు పట్ల నిఘా పెంచామని, తప్పు చేసేవారిపై చర్యలు ఉంటాయన్నారు.

# జమిలికి లైన్ క్లియర్!?




న్యూఢిల్లీ,వన్ నేషన్.. వన్ ఎలక్షన్ నినాదంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశంలో జమిలి ఎన్నికలకు సిద్ధమౌతున్నది. ఇందు కోసం మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ నేతృత్వంలో అత్యున్నత స్థాయి కమిటీని వేసి నివేదిక తీసుకుంది. ఆ నివేదిక జమిలిని సానుకూలంగా ఉండటంతో దేశంలో అన్ని ఎన్నికలూ ఒకే సారి జరిపే దిశగా అడుగులను వేగవంతం చేసింది. ఈ విషయంగా రాష్ట్రాలతోనూ చర్చించింది. బీజేపీ పాలిత రాష్ట్రాలూ, ఎన్డీయే కూటమి పార్టీలూ జమిలికి సై అన్నాయి. బీజేపీయేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలూ, బీజేపీ ప్రత్యర్థి పార్టీలూ జమిలికి నో అన్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ సహా.. స్థానిక పార్టీల నేతృత్వంలో నడుస్తున్న ప్రభుత్వం ఉన్న రాష్ట్రాలు జమిలికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. విషయం అలా ఉండగా కొందరు న్యాయవాదులు కేంద్రం నిర్ణయాన్ని ప్రశ్నించారు. జమిలి ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం సామర్థ్యంపై సందేహాలు వ్యక్తం చేశారు. అలాగే జమిలి నిర్వహణ వల్ల వ్యయం తగ్గుతుందన్న విషయంలోనూ వారు అనుమానాలు వ్యక్తం చేశారు. ఒకే దఫా ఎన్నికల నిర్వహణ ఎన్నికల అవినీతి పెచ్చరిల్లడానికే దారి తీస్తుందని విమర్శలు గుప్పించారు. అయితే వీటిలో వేటికీ కేంద్రం బదులివ్వకపోవడంతో ఢిల్లీ బార్ అసోసియేషన్ సహా దేశ వ్యాప్తంగా సుప్రీం కోర్టులో పెద్ద సంఖ్యలో జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలయ్యాయి. సరే సుప్రీం కోర్టు ఆ పటిషన్లను ఏకకాలంలో విచారించేందుకు అంగీకరించడంతో కేంద్రం కూడా సుప్రీం కు మాజీ రాష్ట్రపతి కోవింద్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ నివేదికను సుప్రీం కు సమర్పించింది. ఆ నివేదిక ప్రకారమే ముందకు వెడుతున్నట్లు పేర్కొంది. ఈ నివేదికపై అధ్యయనం చేసి జమిలికి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్లను క్వాష్ చేయాలని సుప్రీం ను కోరింది. దీనిపై నివేదికను పరిశీలించిన దేశ సర్వోన్నత న్యాయస్థానం జమిలి ఎన్నికలకు సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. దేశం మొత్తం మీద ఒకేసారి ఎన్నికల వల్ల ఖర్చు భారీగా తగ్గుతుందన్న అంశంతో ఏకీభవించింది. అలాగే జమిలికి ఓకే చెప్పింది. దీంతో జమిలికి ఇక అడ్డంకులన్నీ తొలగిపోవడంతో కేంద్రం తన కార్యాచరణను స్పీడప్ చేసింది. జమిలికి దేశ వ్యాప్తంగా మెజారిటీ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో ఈ వర్షాకాల సమావేశాలలోనే జమిలి బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టి ఆమోదం పొందాలని కేంద్రం భావిస్తోంది.

# చంద్రబాబు కేంద్రంగా తెలంగాణ రాజకీయాలు..



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలు చంద్రబాబు కేంద్రంగా సాగుతున్నట్లే కన్పిస్తోంది. ఇదేదో ఆషామాషీగా చెబుతున్న విషయం కాదు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో నేతలు చేస్తున్న విమర్శలను నిశితంగా గమనిస్తే ఈ విషయం ఇట్టే అర్థమవుతుంది. ప్రధానంగా బనకచర్ల అంశంలో ఏపీ ప్రభుత్వం తీరుపై భగ్గుమంటోంది తెలంగాణ ప్రభుత్వం. ఓవైపు పాలమూరు రంగారెడ్డికి నీటి కేటాయింపుల విషయంలో అభ్యంతరం చెబుతున్న ఏపీ సర్కారు.. వరద జలాలతో, సముద్రంలోకి వృథాగా పోయే నీటితో బనకచర్ల కట్టుకుంటామని చెప్పడం సరికాదని తేల్చిచెప్పింది తెలంగాణ ప్రభుత్వం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కేంద్రంలో పలుకుబడి ఉందని.. బనకచర్లకు అన్ని అనుమతులు వస్తాయని సీఎం చంద్రబాబు భావించవద్దు అంటూ సూచించారు ముఖ్యమంత్రి రేవంత్. రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ వద్ద అవసరమైన ప్రణాళిక, వ్యూహం ఉందంటూ తేల్చి చెప్పారాయన.

తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ చంద్రబాబు..

ఇక, ప్రతిపక్ష బీఆర్ఎస్ సైతం చంద్రబాబు కేంద్రంగా విమర్శలు గుప్పిస్తోంది. ఏపీ, తెలంగాణ తనకు రెండు కళ్లు అన్న చంద్రబాబు.. బనకచర్ల విషయంలో చేస్తున్న కామెంట్లు సరైనవి కావన్నారు మాజీ మంత్రి హరీశ్‌రావు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ ఏపీ సీఎం డజన్ల కొద్దీ లేఖలు కేంద్రానికి రాసిన విషయాన్ని గుర్తు చేశారాయన. బనకచర్లపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ మొద్దు నిద్రపోతోందని విమర్శించారాయన. ప్రజాభవన్‌లోనే సీఎం చంద్రబాబు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్య చీకటి ఒప్పందం జరిగిందని ఆరోపించారు మాజీ మంత్రి హరీశ్ రావు. బనకచర్ల విషయంలో బీజేపీ వాదన మరోలా ఉంది. మోదీ ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాలూ సమానమేనంటూ చెప్పుకొచ్చారు కేంద్రమంత్రి బండి సంజయ్. పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర పర్యావరణ అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు కేంద్ర ప్రభుత్వ నిపుణుల కొన్ని కీలక సూచనలు చేశారని.. అన్ని అనుమతులు పొందాకే ప్రాజెక్టు ముందుకు సాగుతుందన్నారు బండి సంజయ్.

బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంలోనూ..

ఒక్క బనకచర్ల ఇష్యూనే కాదు.. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపైనా సీఎం చంద్రబాబు టార్గెట్‌గా విమర్శలు గుప్పిస్తున్నాయి బీఆర్ఎస్ సోషల్ మీడియా వర్గాలు. కమలం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు నియామకం విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు చక్రం తిప్పారని ఆరోపిస్తున్నారు. ఈటల రాజేందర్, డీకే అరుణలాంటి వాళ్లు ఉండగా.. తనకు అనుకూలమైన రామచంద్రరావుకు ఆ పదవి ఎలా ఇస్తారంటూ ప్రచారం చేస్తోంది బీఆర్ఎస్. అయితే.. తెలంగాణ బీజేపీ నేతలు ఈ విషయంలో ఆచి తూచి స్పందిస్తున్నారు. అసలు తమ పార్టీ అధ్యక్షుడి ఎంపిక వ్యవహారంలో ఏపీ సీఎం చంద్రబాబు జోక్యం, ప్రభావం ఎందుకు ఉంటుందని ప్రశ్నిస్తున్నారు కమలం ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి. బీజేపీకి అధ్యక్షుడిని నియమించాలంటే చంద్రబాబు సాయం తీసుకోవాల్సిన అవసరం అధిష్టానానికి లేదని మరికొందరు కాషాయ పార్టీ నేతలు అంటున్నారు.

సంచలన ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి. మంచిగా చెబితే అలాంటి వాళ్లు మాటవినరని అన్నారాయన. అలాంటి వాళ్లకు నల్లా, విద్యుత్ కనెక్షన్లు కట్ చేయాలంటూ తీవ్ర ఆరోపణలు చేశారు అనిరుద్ రెడ్డి. ఇలా దాదాపుగా తెలంగాణలోని అన్ని పార్టీలూ చంద్రబాబు టార్గెట్‌గా విమర్శలు చేయడం వెనుక కారణం ఏంటన్న దానిపై పెద్ద చర్చే పొలిటికల్ సర్కిళ్లలో సాగుతోందట. అయితే..త్వరలోనే స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. వీటిల్లో రాజకీయంగా లబ్ది పొందడంతోపాటు ప్రత్యర్థి పార్టీలపై పైచేయి సాధించడమే లక్ష్యంగా ఇలాంటి విమర్శలు చేస్తున్నారన్న టాక్ విన్పిస్తోంది. మరి ఇవి ఇక్కడితోనే ఆగుతాయా లేదంటే భవిష్యత్‌లోనూ మరింతగా ముదురుతాయా అన్నది తేలాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

# సీఎం రేవంత్ ఎంట్రీతో వరంగల్ కాంగ్రెస్ పంచాయితీకి తెరపడినట్లేనా?



హైదరాబాద్,ఓరుగల్లు కాంగ్రెస్ పంచాయితీ మొన్నటి వరకు హాట్ టాపిక్‌గా కొనసాగింది. రాష్ట్ర వ్యవహాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లురవి దగ్గరకు వ్యవహారం వెళ్లింది. అయినా రెండు వర్గాలు తగ్గకపోవడంతో ఫైనల్‌గా మ్యాటర్ సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి చేరడంతో ఇటు కొండాతో అటు ఎమ్మెల్యేలతో మాట్లాడి సెట్ చేశారని టాక్. కొండా దంపతులు..ఓరుగల్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి వేర్వేరుగా మాట్లాడాంట. దీంతో సవాళ్లు,ప్రతి సవాళ్లు చేసుకున్న నేతలు ఇప్పుడు తమ పార్టీ ఇంటర్నల్ మ్యాటర్ అంటున్నారు.ఒకానొక దశలో కడియం, రేవూరి, నాయిని రాజేందర్‌రెడ్డి లాంటి ఎమ్మెల్యేలు తాము కావాలో..కొండా ఫ్యామిలీ కావాలో తేల్చుకోవాలంటూ ఇంచార్జ్‌కు అల్టిమేటం జారీ చేశారు. క్రమశిక్షణ కమిటీ ముందు కూడా తమ వాదన బలంగా వినిపించారు. కానీ సీఎం రేవంత్ ఎంట్రీతో అంతా చల్లబడ్డారట. ఒకవైపు ఎమ్మెల్యేలతో.. మరోవైపు మంత్రి కొండా సురేఖ, కొండా మురళితో సీఎం స్వయంగా మాట్లాడారు. కొండా మురళితో దాదాపు గంటకు పైగా సీఎం సమావేశమై సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందిగా కోరారట. పంచాయితీ ఇలాగే కొనసాగితే.. త్వరలో రాబోయే లోకల్ బాడీ ఎన్నికలపై ఎఫెక్ట్ పడే ప్రమాదం ఉందని.. రెండు వర్గాలకు నచ్చజెప్పారట. కొండా మురళి కూడా సీఎం స్వయంగా పిలిపించుకొని మాట్లాడటంతో..తమ ప్రయత్నమంతా పార్టీ కోసమే..అలాంటప్పుడు పార్టీకి డ్యామేజ్ చేస్తామా అంటూ సైలెంట్‌గా ఉండేందుకే ఓకే చెప్పారట. ఎమ్మెల్యేలు కూడా కూల్ అయిపోయారు. కొండా మురళికి భయపడుతున్నామా బొంగేం కాదంటూ మాట్లాడిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి..ఇప్పుడు తమ పార్టీ ఇంటర్నల్ వ్యవహారం మేం, మేం చూసుకుంటామంటూ కూల్ డౌన్ అయ్యారట. ఈ ఓవరాల్ ఎపిసోడ్‌లో కొండా ఫ్యామిలీ పైచేయి సాధించిందనేది గాంధీభవన్ టాక్. వరంగల్ పాలిటిక్స్‌లో ఎమ్మెల్యేలుగా మేం కావాలో లేక కొండా ఫ్యామిలీనో తేల్చుకోవాలని ఎమ్మెల్యేలు పార్టీకి అల్టిమేటం జారీ చేసిన తర్వాత కొండా ఫ్యామిలీపై ఎలాంటి చర్యలు ఉంటాయోనన్న ఊహాగానాలు వినిపించాయి. ఇలా ఈ వ్యవహారం కూల్ కావడంతో మరోసారి ఓరుగల్లు కాంగ్రెస్‌లో కొండా పైచేయి సాధించారనే టాక్ నడుస్తోంది.

పలువురు ఎమ్మెల్యేల గెలుపులో కొండా మురళి పాత్ర..

తమ కుటుంబం మీద వ్యతిరేక గ్రూపు చేస్తున్న ఆరోపణలు, విమర్శలను రేవంత్ దగ్గర ప్రస్తావించారు కొండా సురేఖ. అయితే కొండా ఫ్యామిలీకి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడొద్దని జిల్లాలోని ఎమ్మెల్యేలకు చెప్పాలని పీసీసీ చీఫ్‌ను ఆదేశించారట సీఎం రేవంత్. కొండా ఫ్యామిలీ అండ పార్టీకి వరంగల్ జిల్లాలో చాలా అవసరం అని అన్నారట. మొన్నటి ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేల గెలుపులో కొండా మురళి పాత్ర చాలా ఉందన్న విషయాన్ని ఎమ్మెల్యేలు గుర్తించటం లేదని రేవంత్ అన్నట్లు ప్రచారం.ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని..అనవసరంగా ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇచ్చి పార్టీని, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టొద్దని చెప్పారట సీఎం రేవంత్. ఈ నేపథ్యంలో రెండు, మూడు రోజుల్లోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలతో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశం నిర్వహించబోతున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

# కోవూరు కొలిమి.. మాజీ ఎమ్మెల్యే ప్రసన్న వ్యాఖ్యలతో కాక



అమరావతి,నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి– ఆరు సార్లు ఎమ్మెల్యే. అంతే కాదు ఆయన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అప్పట్లో అతి పెద్ద పొలిటికల్ సెన్సేషన్. ఆ ఇంటి పేరుకొక బ్రాండ్ ఇమేజ్ ఉంది. ఆ మొత్తం ఇమేజీని బురద కాలవలో కలిపేస్తున్నారు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి. కేవలం కోవూరు మాత్రమే కాదు నెల్లూరోళ్ల పరువు మొత్తం పెన్నలో కలిపేస్తున్నారా? అన్న మాట వినిపిస్తోంది. ప్రసన్న కుమార్ రెడ్డి కోవూరు మాజీ ఎమ్మెల్యే.. నోటి దురుసు ప్రస్తుతం రాష్ట్రంలో మహిళల ఆగ్రహానికి గురవుతోంది.స్థానిక ఎమ్మెల్యే తనకు సోదరి వరుస కూడా అయిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పట్ల ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇప్పటికే ఇలాంటి వ్యాఖ్యల వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని పార్టీలోని కొందరు అంటుంటే.. వాటిని ఎంత మాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఎలా పడితే అలా మాట్లాడ్డమేంటన్న చర్చకు తెరలేచింది. నల్లపరెడ్ల పరువు మొత్తం తీస్తున్నావుగా అన్న కామెంట్లు వినిపిస్తున్నాయి. ప్రసన్న ఒక పార్టీ కార్యక్రమంలో పాల్గొని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై తీవ్ర పదజాలంతో కామెంట్ చేశారు. అంతే కాదు.. ఆమె భర్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని సైతం అనరాని మాటలు అన్నారు. వీపీఆర్ గా పేరున్న ప్రభాకర్ రెడ్డికి వేల కోట్ల ఆస్తులున్నాయని.. ఆయన్ను హతమార్చడం కోసం కొన్ని టీములు సుపారీ సిట్టింగులు వేసినట్టుగా తనకు సమాచారముందని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు ప్రసన్న. పోయి పోయి పలు చోట్ల తిరిగి పీహెచ్డీలు చేసొచ్చిన.. ప్రశాంతిరెడ్డిని పెళ్లాడే బదులు తనకు చెప్పి ఉంటే.. ఒక మంచి కన్నెపిల్లను ఇచ్చి పెళ్లి చేసి ఉండేవాడ్నని అనడంతో ఇప్పుడు కోవూరు మొత్తం కొలిమిలా తయారైంది. ఇదే సమయంలో ప్రసన్న ఇంటిపై దాడి జరిగింది. దీంతో నెల్లూరు మొత్తం అట్టుడుకుతోంది. తెలుగుదేశం– వైసీపీ మధ్య పొలిటికల్ వార్ షురూ అయ్యింది.అదలా ఉంటే తనపై ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఒక్క మహిళా ఎమ్మెల్యేగా తాను ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన అవినీతిపై ప్రశ్నిస్తే..సభ్య సమాజం చెవులు మూసుకునే విధంగా ప్రసన్న కుమార్ రెడ్డి అనుచిత భాషా ప్రయోగం చేశారని విమర్శించారు. అసభ్యంగా, అసహ్యంగా మాట్లాడి మా నోరు మూయిద్దామనుకుంటున్నావా? అని నిలదీశారు. ఒక మాజీ మంత్రి అయి ఉండీ మహిళల పట్ల ఇంత నీచంగా, అసభ్యంగా మాట్లాడడాన్ని బట్టే ప్రసన్న కుమార్ రెడ్డి ఎలాంటి వారో, ఆయన వ్యక్తిత్వం ఎలాంటిదో తెలుస్తోందన్నారు. ఇక ప్రసన్నకుమార్ రెడ్డి నివాసంపై జరిగిన దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. ప్రసన్న కుమార్ రెడ్డి వల్ల చెప్పుకోలేని బాధలు అనుభవించిన చాలా మందిలో ఎవరో ఒకరు దాడి చేసి ఉండవచ్చన్నారు. అయినా తనపై ఆరోపణలు చేస్తున్న వైసీపీ నేతలకు ఒక సూటి ప్రశ్న అన్న ఆమె.. నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తనపై చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను మీ ఇళ్లల్లోని మహిళలకు వినిపించగలరా అని నిలదీశారు. ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలను జగన్ సీరియస్ గా తీసుకుని ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆఫీస్ స్పేస్‌లో హైదరాబాద్‌కే ఫుల్ డిమాండ్ !



హైదరాబాద్,హైదరాబాద్‌లో హౌసింగ్ రియల్ ఎస్టేట్ డల్ గా ఉందని చెబుతున్నారు. అనుకున్నంతగా వృద్ధి లేదని బాధపడుతున్నారు కానీ ఆఫీస్ లీజింగ్ లో మాత్రం.. హైదరాబాద్ దూసుకెళ్తోంది. దేశంలోని హాట్ ప్రాపర్టీగా మారుతోంది. హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ డిమాండ్ దేశంలోని 8 ప్రధాన నగరాలలో అత్యధికంగా ఉందని నైట్ ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది. 2024లో, హైదరాబాద్‌లో 12.3 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లావాదేవీలు జరిగాయి. హైదరాబాద్ ఆఫీస్ స్టాక్ మూడు రెట్లు పెరిగి, 2024 డిసెంబర్ నాటికి 137 మిలియన్ చదరపు అడుగులకు చేరుకుంది. 2030 నాటికి ఈ స్టాక్ 200 మిలియన్ చదరపు అడుగులను దాటుతుందని CBRE, HYSEA నివేదిక అంచనా వేశాయి.టెక్నాలజీ సెక్టార్ ఆఫీస్ లీజింగ్‌లో 30–35 శాతం వాటాను కలిగి ఉండగా, 2024లో ఇతర రంగాలు కూడా హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ డిమాండ్‌ను పెంచాయి. లైఫ్ సైన్సెస్ రంగం 21 శాతం వాటాతో, ఫ్లెక్సిబుల్ స్పేస్ ఆపరేటర్లు 14 శాతం వాటాతో హైదరాబాద్ ఓన్లీ టెక్ కాదని నిరూపించారు. టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఫైనాన్స్ వంటి రంగాలలో గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్లు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. హైదరాబాద్ GCC లీజింగ్‌లో బెంగళూరు తర్వాత రెండవ స్థానంలో ఉంది. 2024లో GCCలు 5.3 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను లీజ్ కు తీసుకున్నాయి.హైదరాబాద్ బలమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టాలెంట్ ఈకోసిస్టమ్ దీనిని గ్లోబల్ బిజినెస్ , టెక్నాలజీ హబ్‌గా మారుస్తున్నాయి. హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ బలమైన డిమాండ్, విభిన్న సెక్టార్లు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల ఆకర్షణతో దేశంలో అగ్రగామిగా నిలుస్తోంది. హై శాలరీ ఉద్యోగాలు పెరిగితే ఆటోమేటిక్ గా హౌసింగ్ రియల్ ఎస్టేట్ కూడా పెరుగుతుం ది. ఇది కూడా హైదరాబాద్ హౌసింగ్ రియల్ ఎస్టేట్ కు మంచి సూచికే అనుకోవచ్చు.

# పాక్‌లో మళ్లీ సైనిక తిరుగుబాటు..



న్యూఢిల్లీ, పాకిస్థాన్‌లో మళ్లీ సైనిక తిరుగుబాటు జరగవచ్చన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. ప్రజాస్వామిక ప్రభుత్వాలను కూల్చివేసి పరిపాలనా పగ్గాలను చేపట్టడం శక్తివంతమైన పాకిస్థాన్ సైన్యానికి కొత్తేమీ కాదు. అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, పాకిస్థాన్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్(సీఓఏఎస్) జనరల్ అసిమ్ మునీర్ మధ్య విభేదాలు నానా తీవ్రతరం అవుతున్నాయి. ఊహాగానాలు సాగుతున్నాయి. ప్రభుత్వానికి, సైనిక నాయకత్వానికి మధ్య విభేదాలు పతాకస్థాయికిట్లు పలు పాక్ మీడియా సంస్థలు చేరుకున్నాయి. కాగా, పాక్ సైన్యం తిరుగుబాటు యోచనకు బంధించి ఎటువంటి అధికారిక సమాచారం లేనప్పటికీ, పౌర ప్రభుత్వానికి, సైన్యానికి మధ్య ఏర్పడిన ఘర్షణ వైఖరి ఊహాగానాలకు తావిస్తోంది. సైనిక నియామకాలు, పాలనాపరమైన సూచనపై జర్దారీ, మునీర్ మధ్య మొదటిసారి విభేదాలు వెలుగుచూశాయని ఫస్ట్‌పోస్ట్. 2024 మార్చిలో రెండవసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన జర్దారీ రాజ్యాంగపరంగా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించడం పట్ల సైన్యంలో అసంతృప్త పరిస్థితులు నెలకొన్నాయి సమాచారం. సీనియర్ అధికారుల నియామకాలు, పోస్టింగులు, విదేశాంగ విధానం వంటి అంశాలలో తాను రబ్బర్ స్టాంప్ అధ్యక్షుడిగా ఉండబోనని జర్దారీ తీసుకున్న వైఖరి సైన్యానికి మింగుడుపడడం లేదు.పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ అధ్యక్షుడు, అధ్యక్షుడు జర్దారీ కుమారుడు బిలావల్ భుట్టో జర్దారీ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వానికి, సైన్యాధిపతికి మధ్య ఉన్న బట్టబయలు విభేదాలు చేశాయి.అంతర్జాతీయ ఉగ్రవాదులు హఫీజ్ సయీద్, మసూద్ అజర్‌లను భారత్‌కు అప్పగిద్దామంటూ బిలావల్ చేసిన ప్రతిపాదన పాక్‌లోని జిహాదీ గ్రూపులలో తీవ్ర ఆగ్రహాన్ని రగిల్చాయి.

సైనిక తిరుగుబాట్లు కొత్తేమీ కాదు

ప్రత్యక్ష సైనిక తిరుగుబాట్లు పాకిస్థాన్‌కు కొత్తేమీ కాదు. 1958, 1977, 1999లో ప్రత్యక్ష సైనిక తిరుగుబాట్లు జరగగా పౌర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సైన్యం తెరవెనుక అనేక కుట్రలు జరిగాయి. పాక్ స్వతంత దేశంగా ఏర్పడిన నాటి నుంచి సగం కాలం ప్రత్యక్షంగా లేక తమ మద్దతుతో నడిచే రాజకీయ కూటముల ద్వారా సైన్యమే పరిపాలన సాగించింది. 1999లో చివరిగా జరిగిన సైనిక తిరుగుబాటులో ప్రధాని నవాజ్ షరీఫ్‌ని సైనిక జనరల్ పర్వేజ్ ముషారఫ్ పదవీచ్యుతుడిని చేశారు. అంతకుముందు 1977లో ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో(ఆసిఫ్ అలీ జర్దారీ మామ)ని గద్దె దించి జనరల్ జియా ఉల్ హఖ్ సైనిక పాలన విధించారు. అయితే జాతీయ భద్రత, అవినీతి, రాజకీయ కల్లోలం సాకులుగా చూపి అప్పట్లో ఈ సైనిక తిరుగుబాట్లను సమర్థించుకోగా ఇప్పుడు మళ్లీ మీడియా, సైన్యం తిరిగి ఒక్కటవుతున్న సూచనలు కనపడుతున్నాయి.

జనరల్ ఆసిమ్ మునీర్ ఎవరు?

జనరల్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా 2022లో నియమితులైన జనరల్ ఆసిమ్ మునీర్ పాక్ సైనిక గూఢచర్యం, పాక్ అత్యున్నత నిఘా సంస్థ ఐఎస్ఐలో అధికారిగా పనిచేసి విశేష అనుభవం గడించారు. జనరల్ ఖమర్ జావేద్ బజ్వా వివాదస్పద పదవీకాలం తర్వాత మునీర్ తన పదిలం చేసుకున్నారు. పాక్ సైనిక చరిత్రలో ఎవరికీ దక్కని అరుదైన గౌరవం మునీర్‌కి దక్కింది. ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి పొందిన మునీర్ సాయుధ దళాలలో తిరుగులేని శక్తిగా ఎదిగారు. అధ్యక్షుడి అతిథ్యాన్నీ అమెరికా అందుకున్నారు. అధ్యక్షుడిగా జర్దారీని తప్పించి ఆ స్థానంలో తనకు అనుకూలంగా వ్యవహరించే వ్యక్తిని నియమించుకోవడానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై మునీర్ ఒత్తిడి తీసుకొచ్చే అవకాశాలు కూడా లేకపోలేదని వార్తలు వస్తున్నాయి.

# మీడియాను శత్రువుగా చేసుకుని బీఆర్ఎస్ సాధించేదేమిటి?




హైదరాబాద్,మహా టీవీపై దాడి చేసి.. తర్వాత ఏబీఎన్ సంగతి తేలుస్తామని సోషల్ మీడియాలో బీఆర్ఎస్ చేసిన ప్రకటనలు రివర్స్ అయ్యాయి. ఆంధ్రజ్యోతితో పాటు మరికొన్ని మీడియా సంస్థలు బీఆర్ఎస్ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నాయి. చివరికి ఎన్‌టీవీ కూడా అదే బాటలో ఉంది. టీవీ9 ఎప్పటి నుంచో న్యూట్రల్ నాటకాలు వేస్తోంది. నేరుగా మద్దతిచ్చి.. కాంగ్రెస్ పార్టీపై బురద చల్లేందుకు రెడీగా లేదు. అంటే ఇప్పటికిప్పుడు బీఆర్ఎస్ పార్టీకి తమ సొంత మీడియా తప్ప ఏ మీడియా మద్దతు లేకుండా పోయింది.ఆంధ్రజ్యోతికి, ఆర్కేకు కాంగ్రెస్, బీజేపీ పోటీ పడి మద్దతు పలుకుతున్నాయి. బండి సంజయ్ అయితే.. ఏబీఎన్ పై దాడి చేస్తే తాము తెలంగాణ భవన్ పై దాడి చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా బీఆర్ఎస్ తీరుపై మండిపడుతున్నారు. మీడియాపై దాడులు సరి కాదని.. నేరుగా ఆంధ్రజ్యోతి ఆఫీసుకు వెళ్లి సంఘీభావం చెబుతున్నారు. అసలు మహా న్యూస్ ఇష్యూలో .. ఏబీఎన్ కు సంబంధమే లేదు. వారు ఎలాంటి అభ్యంతరకర థంబ్ నెయిల్స్ పెట్టలేదు. అనవసరంగా ఈ వివాదంలోకి ఏబీఎన్ ను తీసుకు వచ్చి దాడి చేస్తామని హెచ్చరించారు.దాన్ని వేమూరి రాధాకృష్ణ .. మరింత పెద్దది చేశారు. తన వీకెండ్ కామెంట్ మొత్తం.. బీఆర్ఎస్ నేతల బెదిరింపులకే పరిమితం చేసి.. మరుగుజ్జు నేతలని.. ఎవరు దాడులు చేసినా.. వెనక్కి తగ్గేది ఉండదని సంకేతాలు ఇచ్చారు. సోషల్ మీడియా బెదిరింపులే తప్ప.. ఏబీఎన్ పై దాడులు చేసేంత ధైర్యం బీఆర్ఎస్ చేయదు. అయితే దాడులు బెదిరింపులు వచ్చినా భద్రత కల్పించలేదని విమర్శలు వస్తాయి కాబట్టి పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.ఇప్పుడు బీఆర్ఎస్‌కు మీడియా శత్రువుగా మారిపోయింది. పాజిటివ్ గా రాయాల్సిన అంశాలకూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఉంటే.. దాన్ని బయట పెట్టేబాధ్యత తీసుకునే మీడియా ఇప్పుడు సాఫ్ట్ నెస్ ప్రదర్శించే అవకాశం ఉంది. అదే సమయంలో ప్రత్యామ్నాయంగా ఉన్న బీజేపీకి మేలు కలిగేలా చేస్తుంది కానీ బీఆర్ఎస్ పై కనీస సానుభూతి కూడా చూపించదు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**